# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 162 | హైదరాబాద్ | బుధవారం 17-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

ఢిల్లీలో సోనియాను కలిసి విజన్ డాక్యుమెంట్ అందించిన సీఎం రేవంత్ రెడ్డి

## నేటి భారతం

- క్షేత్రస్థాయి నుంచే ఏదైనా మొదలవుతుంది..
- అది మంచి కావచ్చు చెడు కావచ్చు మార్పు కావచ్చు...
- అందుకే మ హాత్ములు చెబుతూ ఉంటారు క్షేత్రస్థాయిలో ఏదైనా ప్రక్షాళన జరగాలి..
- అప్పుడే మండలం కానీ జిల్లా కానీ రాష్ట్రం కానీ దేశం కానీ అభివృద్ధి చెందుతుంది..
- క్షేత్ర స్థాయిలో చట్టాల అమలు పగడ్బందీగా జరిగి తీరాలి..
- పరిపాలన అక్కడి వరకు అంది తీరాలి..
- అప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యం అవుతుంది అన్నది అక్షర సత్యం..
- క్షేత్రస్థాయిలో అలసత్వం నెలకొన్నది కాబట్టే అవినీతి అడుగడుగునా రాజ్యం ఏలుతోంది..
- గల్లీ గల్లీ కి ఒక లీడర్ పుట్టుకొని వస్తున్నాడు.. రాష్ట్రస్థాయిలోనే కాకుండా కేంద్రస్థాయిలో తన హవా నడిపిస్తూ ఉన్నాడు..
- ఈ వ్యవస్థను కచ్చితంగా కూలంకుషంగా నివారించవలసిన అగత్యం ఎంతైనా ఉంది..

– ఇంద్రిపల్లి గోవర్ధన్,
అంబేద్కరిస్ట్

## రేవంత్ రెడ్డి
# ఢిల్లీ పర్యటన..
### కేంద్రమంత్రులతో వరుస భేటీ

- కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్‌లను కలిసిన సీఎం
- విజన్ డాక్యుమెంట్‌ను అందజేసిన ముఖ్యమంత్రి
- యంగ్ ఇండియా స్కూళ్లకు పెట్టే ఖర్చును ఎఫ్ఆర్‌బీఎం పరిధి నుంచి తొలగించాలని విజ్ఞప్తి


11లో



11లో

## వక్ఫ్ భూముల
# పరిరక్షణే లక్ష్యం

- తెలంగాణలో వక్ఫ్ భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్న అజారుద్దీన్
- ఉమ్మీద్ పోర్టల్ ఏర్పాటులో సాంకేతిక సమస్యలు తలెత్తాయని వెల్లడి
- మైనార్టీల బడ్జెట్ పెంచేందుకు కృషి చేస్తామన్న మంత్రి

## ఆస్ట్రేలియా కాల్పుల నిందితుడు
# సాజిద్ హైదరాబాద్ వాడే

- సిడ్నీ బాండీ బీచ్ ఉగ్రదాడి నిందితుడు హైదరాబాదీ
- నిందితుడికి హైదరాబాద్ మూలాలు ఉన్నాయని ధృవీకరించిన డీజీపీ
- 27 ఏళ్ల క్రితం స్టూడెంట్ వీసాపై ఆస్ట్రేలియాకు వెళ్లిన సాజిద్
- కుమారుడితో కలిసి దాడి.. ఎదురుకాల్పుల్లో సాజిద్ మృతి


11లో

## టీటీడీ కీలక నిర్ణయాలు...
# అర్చకుల వేతనం రూ.45 వేలకు పెంపు

- తిరుపతిలో 20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మాణం
- అర్చకులు, ఇతర సిబ్బంది వేతనాల్లో భారీ పెంపు
- ముంబై బాంద్రాలో రూ.14.40 కోట్లతో శ్రీవారి ఆలయానికి ఆమోదం
- టీటీడీ విద్యాసంస్థల్లో డిజిటల్ క్లాసులు, మధ్యాహ్న భోజన పథకం
- రథాలు, ధ్వజస్తంభాల కోసం 100 ఎకరాల్లో దివ్య వృక్షాల పెంపకం



11లో

## నగర రాజకీయాల్లో
# గల్లీ లీడర్స్ హవా..!

- ఒక ప్రత్యేక శక్తి కేంద్రంగా గల్లీ లీడర్ వ్యవస్థ..
- బయటకి కనిపించేది చిన్న నేతలుగా మాత్రమే..

12లో

అసలు గల్లీ లీడర్ అంటే ఎవరు? అని ప్రశ్నించుకుంటే.. వార్డు, కాలనీ, బస్తీ, స్లమ్.. ఇవే వీరి రాజ్యాలు. అధికారికంగా పదవి లేకపోయినా, పార్టీ కండువా,నేతలతో ఫోటోలు, పోలీస్ స్టేషన్ పరిచయాలు,మున్సిపల్ కార్యాలయాల్లో పట్టు, ఇవే వీరి నిజమైన 'పవర్స్'.



## యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్‌ను
# కలవడం ఆనందదాయకం

- యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ
- ఆంధ్రప్రదేశ్, అమెరికా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంపై ప్రధానంగా చర్చ
- వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, ఆవిష్కరణల వంటి అంశాలపై సంప్రదింపులు
- అమెరికా సంస్థలకు ఏపీ నమ్మకమైన, భవిష్యత్-సిద్ధ భాగస్వామి అని స్పష్టం
- భారత్-అమెరికా సంబంధాల్లో తెలుగు డయాస్పొరా పాత్ర కీలకమన్న సీఎం



11లో

భారత శక్తి

## జెన్ జెడ్ యుద్ధ భేరీ.. ఇప్పటికే 9 దేశాలు ఖతం

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జెన్ జెడ్ ట్రెండ్ మార్మోగుతోంది. 1995 నుంచి 2012 మధ్య జన్మించిన పిల్లలనే జనరేషన్ జెడ్ అని పిలుస్తుంటారు. ప్రస్తుతం ఎక్కడ చూసిన డిజిటల్ విప్లవం, అధునాతన స్మార్ట్ ఫోన్ లు, ఇంటర్నెట్, ఏఐ యుగంలో వీళ్లు జన్మించారు. ఈ తరంలో జన్మించినవారు అంతకుముందు తరాలవారి వ్యవహారశైలికి భిన్నంగా ఉంటున్నారు. తమపై ప్రభుత్వాలు ఆంక్షలు విధించడాన్ని జెన్ జెడ్ అసలు అంగీకరించడం లేదుబల్గేరియాలో నెలకొన్న రాజకీయ సంక్షోభం తీవ్ర స్థాయికి చేరుకుంది. ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో పెరిగిన అవినీతి ఆరోపణలు, దేశవ్యాప్త నిరసనల కారణంగా ప్రధాని రొసెన్ జెలియాజ్‌కోవ్ నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వం రాజీనామా చేసింది. జెన్–జీ దెబ్బకు మరో ప్రభుత్వం కూలిపోయింది. బల్గేరియా ప్రభుత్వం 2026 ముసాయిదా బడ్జెట్‌ను రూపొందించింది. ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి ఈ బడ్జెట్‌ని రూపొందించారని యువత రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేశారు. దీంతో ప్రభుత్వం వెంటనే ముసాయిదా బడ్జెట్‌ను ఉపసంహరించుకున్నప్పటికీ.. యువత ఆందోళనలు విరమించలేదు. ప్రధాని రొసెన్ జెలియాజ్‌కోవ్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాకముందే.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం చేపట్టాలని నిర్ణయించింది. అవిశ్వాస తీర్మానం పార్లమెంట్‌లో ఓటింగ్‌కు రాకముందే.. తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు బల్గేరియా ప్రధాని ప్రకటించారు.ప్రతిపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై పార్లమెంట్‌లో ఓటింగ్ జరగడానికి ముందే.. నిరసనకారుల గళాన్ని గౌరవిస్తూ రాజీనామా చేస్తున్నట్లు ప్రధాని ప్రకటించారు. ముఖ్యంగా జనవరి 1న బల్గేరియా యూరోజోన్‌లో చేరేందుకు కేవలం 20 రోజులు మాత్రమే ఉన్న కీలక తరుణంలో ఈ నిర్ణయం తీసుకోవడం దేశ రాజకీయాల్లో అనూహ్య మలుపుగా మారింది. బల్గేరియాలో జెన్ జెడ్ సాగించిన అవినీతి వ్యతిరేక ఆందోళనల ధాటికి ప్రధాని రొసెన్ జెలియాజ్‌కోవ్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం పతనమైంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కూడా పూర్తి కాకముందే.. తమ ప్రభుత్వం రాజీనామా చేస్తున్నట్లు ప్రధాని గురువారం ప్రకటించారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షం ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరగడానికి కొద్దిసేపటి ముందే ఆయన ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు.బల్గేరియాలో అవినీతికి వ్యతిరేకంగా వేలాది మంది యువజనులు బుధవారం దేశవ్యాప్తంగా భారీ ఆందోళనలు నిర్వహించారు. ఈ నిరసనలకు ప్రధాన కారణం ప్రభుత్వం రూపొందించిన 2026 ముసాయిదా బడ్జెట్. ఈ బడ్జెట్ అవినీతిని కప్పిపుచ్చేందుకు రూపొందించిందని యువతరం తీవ్రంగా మండిపడింది. ఈ ముసాయిదాపై ఆగ్రహించిన నిరసనకారులు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం గత వారం ఈ ముసాయిదా బడ్జెట్‌ను ఉపసంహరించుకున్నప్పటికీ.. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు ఏ మాత్రం చల్లారలేదు. యువతరం అవినీతి, పాలన లోపాలపై నిరసన కొనసాగించడంతో.. జెలియాజ్‌కోవ్ ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి తీవ్రమైందిప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపక్షం ప్రవేశ పెట్టడం, దేశవ్యాప్త నిరసనలతో ప్రజాగ్రహం పెరగడంతో ప్రధాని రొసెన్ జెలియాజ్‌కోవ్.. అధికార పార్టీ నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశం అనంతరం ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం రాజీనామా చేయడమే సరైన నిర్ణయమని ప్రకటిస్తూ.. గురువారం తన రాజీనామాను సమర్పించారు. ఈ పరిణామం బల్గేరియా రాజకీయాల్లో అస్థిరతకు దారి తీసింది. పూర్తిస్థాయి ప్రజాదరణ ఉన్న ప్రభుత్వం ఏడాది కూడా పూర్తి చేయకుండానే కూలిపోవడంతో.. దేశంలో ఆకస్మిక ఎన్నికలు అనివార్యం కానున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. 2020లో బొయికో బోరిస్సోవ్ ప్రభుత్వాన్ని అవినీతి వ్యతిరేక నిరసనలు కూల్చినప్పటి నుంచి దేశంలో ఏడు ఎన్నికలు జరిగాయి. ఈసారి రాజీనామా చేయకముందు కూడా జెలియాజ్‌కోవ్ ప్రభుత్వం ఐదు అవిశ్వాస తీర్మానాలను ఎదుర్కొని గట్టెక్కింది. రాజీనామా తర్వాత కూడా మంత్రులు కొత్త మంత్రివర్గం ఎన్నికయ్యే వరకు తమ పాత్రలను కొనసాగిస్తారని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది. జెన్ జెడ్ ఆందోళనలు బంగ్లాదేశ్ లోనూ చెలరేగాయి. అక్కడ కూడా ప్రభుత్వం కుప్పకూలింది. తాజాగా యువత చేతిలో నేపాల్ బలైంది. ఇప్పుడు పెరూ దేశం కూడా జెన్ జెడ్ ఆందోళనల ధాటికి అట్టుడుకిపోతుంది. ఈ సంవత్సరంలో మొత్తం 8 దేశాల్లో జెన్ జెడ్ ఆందోళనలు చేపట్టింది. ఇండోనేషియాలో మొదలుపెట్టి ఇప్పుడు పెరూ వరకు వచ్చింది. సెప్టెంబర్ 27 న పెరూ రాజధాని లిమాలో వేలాదిమంది యువత రోడ్లపైకి వచ్చి ఆ దేశ అధ్యక్షుడు దినా బోలువార్టే కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులు, నిరసనకారుల మధ్య ఉద్రిక్తమైన పరిస్థితులు నెలకున్నాయి. పోలీసులు టియర్ గ్యాస్ ను ప్రయోగించారు. లాఠీఛార్జీ చేశారు. అయితే పోలీసులపై నిరసనకారులు రాళ్లు రువ్వారు. పెన్షన్ సిస్టమ్ లో పలు మార్పులు చేసినందుకు ఈ ఆందోళనలు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మొదట్లో ఇండోనేషియాలో ఆ తర్వాత నెథర్లాండ్స్ లో జెన్ జెడ్ ఆందోళనలు చేపట్టింది.

# దివ్య వృక్షాల పెంపకంపై టీటీడీ దూరదృష్టి

తిరుమల,డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి)

దేశంలోనే తొలిసారిగా ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ పరిరక్షణకు దిశానిర్దేశం చేసే దివ్య వృక్షాల ప్రాజెక్టుకు టీటీడీ శ్రీకారం చుట్టింది. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్లు టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు వెల్లడించారు. ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం ప్రాచీన, ఆగమ శాస్త్రాలకు అనుగుణమైన హిందూ దేవాలయాల్లో అత్యంత ప్రాముఖ్యమైన ధ్వజస్తంభాల నిర్మాణానికి అవసరమైన దివ్య వృక్షాలను టీటీడీ స్వయంగా పెంచి, పరిరక్షించి వినియోగించడమేనన్నారు. సీఎం చంద్రబాబు దూరదృష్టితో రూపొందించిన తిరుమల అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు ఉంటుందన్నారు. సంప్రదాయాల పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే బాధ్యతాయుత పాలనకు ఇది నిదర్శనమని బీ.ఆర్ నాయుడు అన్నారు.ధ్వజస్తంభం కేవలం నిర్మాణాత్మక అంశం మాత్రమే కాదు. అది భౌతిక లోకానికి, దైవ లోకానికి మధ్య ఉన్న శాశ్వత బంధానికి ప్రతీకగా నిలుస్తుంది. ఆలయ ప్రాంగణంలో నిటారుగా నిలిచి ఉండే ధ్వజస్తంభం భక్తి, పవిత్రత, దైవ సన్నిధిని ప్రతిబింబిస్తుంది. ఆగమశాస్త్రాల ప్రకారం ధ్వజస్తంభం నిటారుగా పెరిగిన ఒకే చెట్టుకు చెందిన పవిత్ర వృక్ష కాండంతో తయారు చేయాలి. ఆ వృక్షాన్ని ఆధ్యాత్మిక, జ్యోతిష్య, విధి విధానాలకు అనుగుణంగా ఎంపిక చేసి, ఏళ్ల తరబడి సంరక్షించి, ఆపై శాస్త్రోక్తంగా కైంకర్యాలు నిర్వహించిన అనంతరం వినియోగిస్తారు.

ఆగమ సంప్రదాయాల ప్రకారం ధ్వజస్తంభాల తయారీలో సాధారణంగా టేకు, ఏగిశా (ఇండియన్ కినో), టెర్మినేలియా, షోరియా జాతికి చెందిన వృక్షాలను వినియోగిస్తారు. ఇవి బలంగా, దీర్ఘకాలికంగా నిటారుగా పెరిగే స్వభావం కలిగి ఉండటం వల్ల ధ్వజస్తంభం అవసరాలకు అనుకూలంగా ఉంటాయి. పరిపక్వత చెందిన తర్వాత ఆ వృక్షాన్ని శాస్త్రోక్తంగా పూజించి, ఆపై ధ్వజస్తంభంగా రూపకల్పన చేస్తారు. అనంతరం దానిని కవచంతో కప్పి, తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం లాంటి అత్యంత పవిత్ర ఆలయాల్లో స్వర్ణ కవచంతో అలంకరిస్తారు. ఇక రాజగోపురం, గర్భగుడి విమానం మధ్య పవిత్ర ప్రదేశంలో ప్రతిష్ఠించే ధ్వజస్తంభంపై గరుడ ధ్వజాన్ని ఆవిష్కరిస్తారు. సాలకట్ల



బ్రహ్మోత్సవాల ప్రారంభాన్ని ప్రకటించే ఈ ధ్వజారోహణం సమస్త లోకాల్లోని దేవతలను ఆహ్వానించే శుభ సూచకంగా నిలుస్తుంది. ఇక దేశవ్యాప్తంగా 60కి పైగా ఆలయాలను టీటీడీ నిర్వహిస్తోంది. భవిష్యత్తులో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయాలను ఆగమ నియమాలకు అనుగుణంగా నిర్మించే బాధ్యతను దృష్టిలో ఉంచుకుని ఈ దివ్య వృక్షాల ప్రాజెక్టును అత్యంత దూరదృష్టితో ప్రారంభిస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా కాలక్రమేణ మార్పు అవసరమైన ధ్వజస్తంభాల స్థానంలో శాస్త్రోక్తంగా కొత్త ధ్వజస్తంభాలను ఏర్పాటు చేస్తారు. భవిష్యత్తులో టీటీడీ నిర్మించనున్న ఆలయాలకు అవసరమైన ధ్వజస్తంభాల కోసం పవిత్రమైన కలపను ముందుగానే సిద్ధం చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం.ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో భాగంగా సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో దివ్య వృక్షాల ప్రాజెక్టు కోసం కేటాయించాలని టీటీడీ బోర్డు ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు అమలుతో, ధ్వజస్తంభాల కోసం అవసరమైన దివ్య వృక్షాలను స్వయంగా పెంచే తొలి దేవాలయ సంస్థగా టీటీడీ దేశంలో చరిత్ర సృష్టించనుంది. దీని ద్వారా ఆగమ శుద్ధి, ఆధ్యాత్మిక పవిత్రత, పర్యావరణ బాధ్యత, సంస్థాగత స్వావలంబనను తరతరాలకు కొనసాగించగలుగుతామని టీటీడీ స్పష్టం చేసింది.

ఇక థర్డ్ పార్టీ తనిఖీలు

కల్తీ నెయ్యి, నకిలీ పట్టు దుపట్టాలకు సంబంధించిన కేసుల నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న సేకరణ, నాణ్యత తనిఖీ వ్యవస్థలను బలోపేతం చేయాలని టీటీడీ భావిస్తోంది. నెయ్యి కల్తీ కేసుపై ప్రస్తుత దర్యాప్తులో సరఫరా గొలుసులో తీవ్రమైన లోపాలు వెల్లడయ్యాయని, నాణ్యత, జవాబుదారీతనం నిర్ధారించడానికి స్పష్టమైన, ఏకరీతి సేకరణ వ్యవస్థ అవసరాన్ని టీటీడీ ఆలోచన చేస్తోందిసేకరణలో లొసుగులను నిలిపివేయడానికి సమగ్ర సేకరణ మాన్యువల్ అవసరమని ట్రస్ట్ బోర్డు భావించిందని ఓ అధికారి తెలిపారు. థర్డ్ పార్టీ సర్టిఫికేషన్ విషయంలో భారత ఆహార భద్రత, ప్రమాణాల అథారిటీ నిబంధనలకు అనుగుణంగా స్పష్టంగా నిర్వచించిన విధానాలు, సరఫరా గొలుసులను బలోపేతం చేయాలని టీటీడీ భావించింది. కల్తీని, నాణ్యత లేని సామాగ్రిని అడ్డుకోవడం, ఆలయ సంబంధిత సేవలకు ఉపయోగించే పదార్థాలపై విశ్వాసాన్ని పునరుద్ధరించడం దీని లక్ష్యమని అధికారి తెలిపారు.కొత్త మాన్యువల్ ట్రస్ట్.. టీటీడీ చేసే అన్ని కొనుగోళ్లకు మార్గదర్శకంగా పనిచేస్తుంది. ఇది ఉత్పత్తి వివరణలు, నమూనా సేకరణ, నిర్వహణ, నాణ్యత తనిఖీలు, సరఫరా ఒప్పందాలు, డెలివరీ షెడ్యూల్‌లు, సరఫరాదారులకు సాంకేతిక, ఆర్థిక అర్హత ప్రమాణాలకు సంబంధించిన విధానాలను చెబుతుంది.టీటీడీ తీసుకురాబోయే కొత్త వ్యవస్థకు అంతర్గత ప్రయోగశాల పరీక్ష కోసం స్పష్టమైన ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలతో పాటు, తప్పనిసరి థర్డ్ పార్టీ ధృవీకరణ అవసరం. అన్ని సేకరణలు ఈఎంఏఐ, ఇతర వర్తించే నియమాలను కచ్చితంగా పాటించాలి.ఆలయ పూజలు, అన్నదానం, వసతి, ఇతర కార్యకలాపాల కోసం దాదాపు 300 రకాల సామాగ్రిని సేకరించడానికి టీటీడీ ప్రతి సంవత్సరం సుమారు రూ.700 కోట్లు ఖర్చు చేస్తుంది. నెయ్యి ఒక్కటే వార్షిక వ్యయం దాదాపు రూ.70 కోట్లు. గిడ్డంగి సామర్థ్యం సరిపోకపోవడం, ఆధునిక నిల్వ పద్ధతులు లేకపోవడంపై టీటీడీ బోర్డు ఆలోచన చేస్తోంది. ఎందుకంటే ఇది జాబితా నిర్వహణ, మెటీరియల్ నాణ్యత రెండింటికీ ప్రమాదాలను కలిగిస్తుంది.సంస్కరణల్లో భాగంగా క్లైమెట్ కంట్రోల్ స్టోరేజ్, శాస్త్రీయ జాబితా నిర్వహణ వ్యవస్థలు, ఉష్ణోగ్రత, తేమ, పరిశుభ్రత ఆటోమేటెడ్ పర్యవేక్షణ, డిజిటల్ ట్రాకింగ్ విధానాలు, అగ్ని మరియు ఆహార–భద్రత–అనుకూల మౌలిక సదుపాయాలతో కూడిన అదనపు గిడ్డంగి సౌకర్యాలను తీసుకురావాలని టీటీడీ భావిస్తోంది.

# జగన్‌కు రోజా షాక్



తిరుపతి, డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి)

వైసీపీ పార్టీలో ఫైర్ బ్రాండ్లలో మాజీ మంత్రి రోజా ఒకరు. జగన్మోహన్ రెడ్డి పట్ల వీర విధేయత ప్రదర్శించిన నేతల్లో కూడా ఆమె ముందుంటారు. అయితే ఇటీవల ఆమె పెద్దగా కనిపించడం లేదు. సహజంగానే సినీ పరిశ్రమకు చెందిన ఆమె బిజీగా ఉంటారు. అందుకే కనిపించడం లేదని అంత భావించారు. అయితే ఆమె హై కమాండ్ పై మనస్థాపంతోనే పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నట్లు ప్రచారం మొదలైంది. అయితే రోజాపై ఇటువంటి ప్రచారం కొత్త కాదు. మొన్నటి ఎన్నికల ఫలితాల తర్వాత కూడా ఇదే తరహా ప్రచారం నడిచింది. ఆమె తమిళ చిత్ర పరిశ్రమ వైపు మళ్లీ వెళ్ళినట్లు.. అక్కడే స్థిరపడతారని టాక్ నడిచింది. రాజకీయాలు విడిచి పెడతారని కూడా విశ్లేషణలు వచ్చాయి. కానీ ఆమె తిరిగి తాడేపల్లి ప్యాలెస్ లో హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం పై విమర్శలు చేశారు. కానీ ఇప్పుడు ఉన్నఫలంగా కనిపించడం లేదు. ఇటీవల జరిగిన పరిణామాలతోనే ఆమె కనిపించడం లేదని తెలుస్తోంది.చిత్తూరు జిల్లా నగిరి నుంచి రెండుసార్లు ప్రాతినిధ్యం వహించారు రోజా. రెండుసార్లు కూడా అతి కష్టం మీద గెలిచారు. 2019లో రాష్ట్రవ్యాప్తంగా జగన్ ప్రభంజనం ఇచ్చింది. ఆ సమయంలో సైతం నగిరి నుంచి తక్కువ మెజారిటీతో గెలిచారు రోజా. అయితే ఇందుకు సొంత పార్టీ నేతల వెన్నుపోటు కారణమని ఆమె ఆరోపించారు. ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ప్రమాణం స్వీకారం చేయకముందే దీనిపైనే రోజా ఫిర్యాదు చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన కొత్త కాబట్టి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక పట్టించుకోలేదు. అయితే 2019 ఎన్నికల్లో గెలిచిన తర్వాత రోజాకు మంత్రి పదవి ఇవ్వలేదు. అందుకు సొంత పార్టీ నేతలే అడ్డుకున్నారని ఆమె కన్నీటి పర్యంతం అయ్యారు. విస్తరణలో మంత్రి పదవి వచ్చాక అందరి లెక్క తేల్చుతానని హెచ్చరించారు. అయితే ఐదేళ్లపాటు ఎమ్మెల్యేగా, ఆపై మంత్రిగా వ్యవహరించిన రోజా సొంత పార్టీ వారిని లెక్క చేయలేదన్న విమర్శ ఉంది.మొన్నటి ఎన్నికల్లో రోజాకుటిక్కెట్టు ఇవ్వొద్దని సొంత పార్టీ నేతలే కోరారు. కానీ జగన్మోహన్ రెడ్డి ఆమెపై ఎంతో నమ్మకం ఉంచి టికెట్ ఇచ్చారు. అయితే ఆమె ఘోరంగా ఓడిపోయారు. ఎన్నికల పోలింగ్ జరిగిన నాడే సొంత పార్టీ నేతలపై విమర్శలు చేశారు. తమ పార్టీ నేతలే ప్రత్యర్థి తో చేతులు కలిపారని ఆరోపించారు. అయినా సరే తానే గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. కానీ భారీ ఓట్ల తేడాతో ఓడిపోయారు. అప్పుడు కూడా అధినేత జగన్మోహన్ రెడ్డికి సొంత పార్టీ నేతలపై ఫిర్యాదు చేశారు. ఆయన పట్టించుకోలేదు. అయితే ఇటీవల నగిరి నియోజకవర్గంలో రెండు మండలాలు టిడిపి ఖాతాలో పడ్డాయి. వైసీపీ ఎంపీపీలపై అవిశ్వాసం పెట్టి టీడీపీ కైవసం చేసుకుంది. దీనిపై కూడా హై కమాండ్ కు ఫిర్యాదు చేశారు రోజా. సొంత పార్టీ నేతలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కానీ జగన్ పట్టించుకోకపోయేసరికి తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఇక రాజకీయాలు చేయడం వేస్ట్ అని.. వైసీపీలో కొనసాగడం కష్టమేనని తన అనుచరుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. మరి రోజా ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి

# ప్రతికూలతను..అనుకూలంగా మార్చుకొని

శ్రీకాకుళం డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి)

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుయువ రాజకీయ నాయకుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్ర మోడీఇద్దరి



విశ్వాసాన్ని పొందిన నేతగా ఆయనకు పేరుంది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ప్రావీణ్యం ఉండటంతో పాటు పార్లమెంటులో ఏ అంశంపైనైనా ధైర్యంగా, స్పష్టంగా మాట్లాడగల నైపుణ్యం ఆయనకు ఉంది. ఈ లక్షణాలే ఆయనకు నలభై ఏళ్ల వయసు కూడా రాకముందే కేంద్రంలోని కీలకమైన శాఖ బాధ్యతలు అప్పగించే స్థాయికి తీసుకెళ్లాయి. అలా ఆయనకు పౌర విమానయాన శాఖ బాధ్యతలు లభించాయిఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి వచ్చిన యువ నేతకు కేబినెట్ హోదా రావడంతో, ఇంత పెద్ద బాధ్యతను ఆయన సమర్థంగా నిర్వర్తించగలరా అన్న సందేహాలు మొదట్లో కొందరిలో కనిపించాయి. కానీ నెమ్మదిగా తన పనితీరుతో ఆ అనుమానాలను తగ్గిసస్తూ ముందుకు సాగారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది జూన్ నెలలో ఆయనకు పెద్ద సవాల్ ఎదురైంది. గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ సమీపంలో ఎయిర్ ఇండియా ( విమానం ప్రమాదానికి గురై సుమారు 250 మంది ప్రాణాలు కోల్పోవడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనలో సంస్థ నిర్లక్ష్యం ఉందనే ఆరోపణలు కూడా వెల్లువెత్తాయి. అప్పట్లో విమానయాన రంగంపై ప్రభుత్వ పర్యవేక్షణ మరింత బలంగా ఉండాలన్న విమర్శలు వినిపించాయి.ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపిస్తామని కేంద్ర మంత్రి హోదాలో రామ్మోహన్ నాయుడు స్పష్టంగా ప్రకటించారు. ఆ ఘటనపై రూమర్స్ తగ్గకముందే మరో పెద్ద సమస్య తలెత్తింది. ఇండిగో సంస్థకు సంబంధించిన వివాదాలు ఒక్కసారిగా జాతీయస్థాయిలో చర్చకు వచ్చాయి. దీనితో ప్రతిపక్షాలు మాత్రమే కాకుండా జాతీయ మీడియా కూడా ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించింది. పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండటంతో ఒకవైపు సభలో సమాధానాలు ఇవ్వడం, మరోవైపు మీడియాను ఎదుర్కోవడం, అదే సమయంలో సంబంధిత శాఖాపరమైన చర్యలు చేపట్టడం వల్ల ఆయన తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నారు.రామ్మోహన్ నాయుడు రాజకీయంగా ఇబ్బందుల్లో పడ్డారని, ఆయన పదవికే ముప్పు ఉందన్న ప్రచారం కూడా జరిగింది. అయితే ఈ దశలోనే ఆయన తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. పార్లమెంటులో ఇచ్చిన సమర్థవంతమైన సమాధానాలతో విమానయాన రంగం మోనోపలీ అవుతోందన్న ఆరోపణలకు తగిన వివరణ ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని దేశీయ విమానయాన రంగంలో సంస్కరణలు తీసుకువస్తున్నామని వివరించారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యాలే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టంగా చెప్పారుజాతీయ టీవీ చర్చల్లో కూడా ఆయన ధైర్యంగా తన వాదనలు వినిపించారు. ఫలితంగా విమర్శలు క్రమంగా తగ్గాయి. ఒక సంఘటన వల్ల వచ్చిన ప్రతికూలతను తనకు అనుకూలంగా మలుచుకోవడంలో ఆయన కొంతవరకు విజయవంతమయ్యారని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మంచి లేదా చెడు కారణమైనా, ఈ పరిణామాలతో దేశవ్యాప్తంగా ఆయన పేరు మరింతగా వినిపించింది. యువ కేంద్ర మంత్రిగా రామ్మోహన్ నాయుడు ముందున్న రోజుల్లో ఎలా రాణిస్తారన్న ఆసక్తి ఇప్పుడు మరింత పెరిగిందని చెప్పాలి.

# వైసీపీ బలమా... బలహీనతా...

గుంటూరు డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి)

రాజకీయాలు ఎప్పుడూ ఒకే విధంగా సాగవు. ఒక్కోసారి ఊహించని మలుపులు తిరుగుతాయి. పరిస్థితులను గమనిస్తూ సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకునే నాయకులే రాజకీయాల్లో నిలదొక్కుకుంటారు. కొందరు రాజకీయాలను ఒక పోరాటంగా చూస్తే, మరికొందరు దాన్ని ఒక వ్యూహాత్మక ఆటలా భావిస్తారు. గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లే క్రమంలో అవసరమైతే నిర్ణయాలను మార్చుకోవడం, పొత్తులు పెట్టుకోవడం సాధారణమే. కానీ వైసీపీ మాత్రం మొదటి నుంచీ తనదైన ఆలోచనా విధానంతో ముందుకు సాగుతోంది. వైసీపీ అధినాయకత్వం పొత్తుల రాజకీయాలకు దూరంగా ఉండాలని స్పష్టమైన నిర్ణయంతో ఉంది. ఇతర పార్టీలతో కలిసి వెళ్లడం కంటే ఒంటరిగా బరిలోకి దిగడమే తమ సిద్ధాంతమని ఆ పార్టీ నేతలు పలుమార్లు చెప్పారు. ఈ విధానం వల్లే దేశ రాజకీయాల్లో వైసీపీని ప్రత్యేకంగా చూస్తారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. దేశవ్యాప్తంగా చాలా పార్టీలు అవసరాన్ని బట్టి పొత్తులు పెట్టుకుని అధికారాన్ని సాధించాయి. అది తప్పు కాదని, రాజకీయాల్లో సాధారణ వ్యూహమేనని భావిస్తారు. అయినప్పటికీ వైసీపీ మాత్రం సింగిల్‌గా పోటీ చేయడమే తన గుర్తింపుగా కొనసాగిస్తోంది. కాలక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిస్థితులు బాగా మారాయి. ప్రస్తుతం రాష్ట్రంలో బలమైన ఎన్డీయే కూటమి అధికారంలో ఉంది. భవిష్యత్తులో 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మూడు ప్రధాన పార్టీలు తమ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో వైసీపీ మళ్లీ ఒంటరిగానే బరిలోకి దిగాల్సి ఉంటుంది. ఇతర పార్టీలతో కలిసి వెళ్లే ఆలోచన ఆ పార్టీకి లేదనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. వామపక్షాలు, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి పార్టీలను కలుపుకుని వైసీపీ ఒక ప్రతిపక్ష కూటమిని ఏర్పాటు చేసే అవకాశం ఉందని కొందరు భావిస్తున్నారు. కానీ పార్టీ అధినాయకత్వం ఆ దిశగా ఆసక్తి చూపడం లేదని చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో



2029లో కూటమి రాజకీయాల ముందు వైసీపీ అవకాశాలు ఎలా ఉంటాయన్న అంశంపై పార్టీ లోపల కూడా ఆలోచనలు జరుగుతున్నాయట. ఇదే సందర్భంలో నెల్లూరు జిల్లా కు చెందిన మాజీ మంత్రి నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలు మళ్లీ చర్చకు వస్తున్నాయి. అప్పట్లో బీజేపీ తో పొత్తు పెట్టుకుని ఉండాల్సిందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇది ఒక్కరి మాట మాత్రమే కాదు, చాలామందిలో ఇలాంటి భావన ఉందని అంటున్నారు. కారణం కేంద్రంలో బీజేపీ బలంగా ఉండటం, ఆ పార్టీ మద్దతుతో రాష్ట్రంలో గెలువు సులువవుతుందన్న అంచనా. అయితే బీజేపీతో పొత్తు పెట్టుకుంటే వైసీపీకి కొంత ఓటు బ్యాంకు దూరమవుతుందన్న భయం అధినాయకత్వంలో ఉందని ప్రచారం. మరోవైపు బీజేపీ కూడా వైసీపీతో కలిసి రావడానికి ఆసక్తి చూపడం లేదని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. చంద్రబాబు నాయుడు తో సన్నిహితంగా ఉండడానికే బీజేపీ ప్రాధాన్యం ఇస్తోందని, జాతీయ స్థాయిలో ఆయన పాత్ర కీలకమని ఆ పార్టీ భావిస్తోందని అంటున్నారు. ఈ పరిణామాలన్నింటిని చూస్తే 2024కు ముందు పరిస్థితులు ఎలా ఉన్నా, ఇప్పటి రాజకీయ సమీకరణల్లో వైసీపీ?బీజేపీ పొత్తు సాధ్యమయ్యే అవకాశాలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. భవిష్యత్తులో రాజకీయాలు ఎలాంటి మలుపు తిరుగుతాయో చూడాల్సిందే అని విశ్లేషకులు అంటున్నారు.

# తెరపైకి మంత్రివర్గ ప్రక్షాళన

విజయవాడ, డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి)

రాష్ట్ర రాజకీయాల్లో మంత్రివర్గ ప్రక్షాళన అంశం మళ్లీ చర్చకు వచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండేళ్ల పాలన దిశగా అడుగులు వేస్తుండటంతో, ఈ సమయంలో మంత్రివర్గంలో మార్పులు ఉంటాయా లేదా అనే ఆసక్తి పార్టీ వర్గాల్లో పెరిగింది. చాలా మంది నేతలు ఈ అవకాశంపై ఆశలు పెట్టుకున్నారు. దాదాపు పది నుంచి పదిహేను మంది వరకు మంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలో అనుభవజ్ఞులైన సీనియర్లతో పాటు తొలిసారి అవకాశం కోసం ఎదురుచూస్తున్న జూనియర్లు కూడా ఉన్నారు. కొద్ది నెలల క్రితమే మంత్రివర్గంలో మార్పులు జరుగుతాయన్న ప్రచారం జోరుగా సాగింది. కొందరు మంత్రుల



పనితీరుపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారన్న వార్తలు రావడంతో, వారిని తప్పించి కొత్తవారికి అవకాశం ఇస్తారనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఏర్పడింది. అయితే ఆ తర్వాత ఈ అంశం అనూహ్యంగా తెరమరుగైంది. అప్పటి నుంచి మంత్రివర్గ ప్రక్షాళనపై స్పష్టత రాకపోవడంతో నేతల్లో అయోమయం నెలకొంది. ఇప్పుడు మళ్లీ ఈ విషయం టిడిపి లో చర్చకు వస్తోంది. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం నుంచి దక్షిణాంధ్రలోని చిత్తూరు వరకు పలువురు కీలక నాయకులు మంత్రి పదవి కోసం ఎదురు చూస్తున్నారు. ఎమ్మెల్యేలతో పాటు కొంతమంది ఎమ్మెల్సీలు కూడా ఈ రేసులో ఉన్నట్లు సమాచారం. పార్టీ కోసం కష్టపడ్డామని, తమకు అవకాశం ఇవ్వాలనే భావనతో వారు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అయితే, ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి ఇప్పటివరకు పూర్తిగా దృష్టి పెట్టలేదన్న అభిప్రాయం ఉంది. అసలు ఈసారి మంత్రివర్గ ప్రక్షాళన ఉండకపోవచ్చన్న మాట కూడా పార్టీలో వినిపిస్తోంది. గతంలో 2014 నుంచి 2019 మధ్య కాలంలో ఒకసారి మాత్రమే చిన్నపాటి మార్పులు చేశారు. అప్పట్లో ఒకరిద్దరు మంత్రులను మార్చి మిగిలిన వారిని కొనసాగించారు. ఆ విధానమే ఇప్పుడు కూడా అనుసరించే అవకాశం ఉందని కొందరు నేతలు అంటున్నారు. వైసీపీ పాలనలో మొత్తం మంత్రివర్గాన్ని మార్చిన విధానం అప్పట్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఒకరిద్దరిని తప్ప మిగిలిన వారందరినీ తొలగించి కొత్తవారిని తీసుకోవడం వల్ల శాఖల పనితీరుపై ప్రభావం పడిందన్న విమర్శలు వచ్చాయి. అదే పరిస్థితి మళ్లీ రాకూడదన్న ఆలోచనతో చంద్రబాబు వ్యవహరిస్తున్నారని పార్టీ వర్గాల అంచనా. ప్రస్తుతం ఒక మంత్రి పదవి ఖాళీగా ఉండగా, అవసరమైతే మరో రెండు లేదా మూడు స్థానాల్లో మాత్రమే మార్పులు చేసే అవకాశముందని చెబుతున్నారు. చివరికి ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలి, కానీ ఆశావహుల ఎదురుచూపులు మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

# స్రవంతి తప్పటడుగులు...



నెల్లూరు, డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి)

పార్టీలు మారే రాజకీయ నేతలకు విలువ ఉండదు. అందులో ముఖ్యంగా ఒక స్థాయి నేతలకు పార్టీ మారితే అస్సలు పట్టించుకోరు. నెల్లూరు మేయర్ పొట్లూరి స్రవంతి కూడా ఇదే కోవలోకి వస్తారు. నెల్లూరు కార్పొరేషన్ లో జరిగిన ఎన్నికల్లో అన్ని డివిజన్లను వైసీపీ నాడు గెలుచుకుంది. సామాజికవర్గం కోణంలో పొట్లూరి స్రవంతిని నాడు జగన్ మేయర్ గా ఎంపిక చేశారు. నాడు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అనుచరులుగా ఉండే మేయర్ స్రవంతి, ఆమె భర్తకు ఆ పదవి లభించింది. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో వారిద్దరూ కోటంరెడ్డి వెంట టీడీపీకి అనుకూలంగా మారారు. టీడీపీలో చేరారు. కానీ తర్వాత మొన్నటి శాసనసభ ఎన్నికల్లో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి వ్యతిరేకంగా ఆదాల ప్రభాకర్ రెడ్డికి అనుకూలంగా ప్రచారం చేశారు. కానీ బ్యాడ్ లక్.. వైసీపీ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వస్తుందని భావిస్తే కూటమి ప్రభుత్వం కొలువు దీరింది. అయితే తాను గిరిజన మహిళ కావడంతో తన పదవికి ఎసరు ఉండదని నమ్మినట్లుంది. వైసీపీ అధికారం కోల్పోయిన వెంటనే తిరిగి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అంటే.. టీడీపీ చెంతకు చేరడానికి మొగ్గు చూపారు. కానీ కోటంరెడ్డి దగ్గరకు చేరనివ్వలేదు. దీంతో మేయర్ కొంత న్యూట్రల్ గానే ఉన్నారు. ఇప్పుడు మేయర్ రాజీనామా చేయాల్సి వచ్చిందంటే కారణం.. ఇటు టీడీపీ నేత కోటంరెడ్డి వద్ద నమ్మకాన్ని కోల్పోవడం... అటు వైసీపీ కార్పొరేటర్ల నుంచి కూడా సరైన మద్దతు లభించకపోవడమేనన్నది తెలుసుకోవాలి. ఎందుకంటే స్రవంతి వైసీపీలోనూ మళ్లీ చేరలేకపోయారు. ఇలా రెంటికి చెడ్డ రేవడిలా మారిపోయినట్లు కనిపిస్తుంది. తాజాగా మేయర్ పదవికి పొట్లూరి స్రవంతి రాజీనామా చేశారు. ఆ రాజీనామాను వెంటనే కలెక్టర్ ఆమోదించారు. ఈ నెల 18వ తేదీన అవిశ్వాసం చివరకు మేయర్ ఎన్నికకు దారితీసేలా ఉంది. తాత్కాలిక మేయర్ గా రూప్ కుమార్ యాదవ్ ను కలెక్టర్ నియమించారు. ఇప్పుడు కోటంరెడ్డి శ్రీధర్ పై ఎన్ని ఆరోపణలు చేసినా అవి చెల్లుబాటు కావు. విమర్శలకు వాల్యూ ఉండదు. నమ్మి పెద్ద పదవి ఇచ్చిన వారి వెంట ఉండకుండా స్రవంతి ఆమె భర్త ఇష్టమొచ్చిన రీతిలో పార్టీ కండువాలు మార్చేయడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తింది. నిజంగా ఇది వారు చేజేతులా చేసుకున్నదే. కొందరంతే.. అలా వెలిగి.. అలా రాజకీయంగా ఆరిపోతారంతే. అందులో మేయర్ దంపతులు కూడా ఒకరని అనుకోవాల్సి ఉంటుంది. సింహపురి రాజకీయాలను శాసిద్దామనుకుని వచ్చిన వారు వేసిన తప్పటడుగులు

# యాదగిరిగుట్టలో ఘనంగా ధనుర్మాస వేడుకలు




యాదగిరిగుట్ట: డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి)

భక్తుల కొంగు బంగారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం ధనుర్మాస వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం నుంచి జనవరి 14వ తేదీ వరకు ఈ వేడుకలను నిర్వహించనున్నారు. గోదాదేవి అమ్మవారు శ్రీరంగనాథుని కొలుస్తూ నెల రోజులపాటు నిర్వహించే పాశుర పఠనాలను ఆలయ అర్చకులు, పారాయణీకులు ప్రత్యేకంగా జరిపిస్తారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం 4.30 నుంచి 5 గంటల వరకు శ్రీస్వామి వారి ఆలయ ముఖ మండపంపై ఉత్తర భాగంలోని హాల్‌లో గోదాదేవి అమ్మవారిని వేంచేపు చేసి తిరుప్పావై కార్యక్రమం నిర్వహిస్తారు. దీంతోపాటు మార్గళి నివేదన వంటి వేడుకలు జరగనున్నాయి. ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఆలయ నిత్య కైంకర్యాల సమయాల్లో మార్పులు చేశారు. మంగళవారం నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు వేకువజామున 3.30 గంటలకు ఆలయాన్ని తెరిచి స్వామివారిని మేల్కొలిపి సుప్రభాతం నిర్వహిస్తారు. అనంతరం 4 గంటల నుంచి 4.30 గంటల వరకు తిరువారాధన, 4.30 నుంచి 5 గంటల వరకు తిరుప్పావై సేవాకాలం జరిపిస్తారు. 5 నుంచి 6 గంటల వరకు నివేదన, చాత్మర, 6 నుంచి 7 గంటల వరకు నిజాభిషేకం, 7 నుంచి 7.45 గంటల వరకు సహస్రనామార్చన, ఉదయం 7.45 నుంచి స్వామివారి సర్వదర్శనాలు ప్రారంభిస్తారు. ధనుర్మాసోత్సవాలలో భాగంగా జనవరి 14న రాత్రి 7 గంటలకు గోదాదేవి కల్యాణం, 15న ఉదయం 11.30 గంటలకు ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహిస్తారు. ఘనంగా లక్షపుష్పార్చనయాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఏకాదశి పర్వదినం సందర్భంగా శాస్త్రోక్తంగా లక్ష పుష్పార్చన నిర్వహించారు. సోమవారం స్వామి, అమ్మవార్ల సహస్ర నామ పఠనంతో అర్చక బృందం, వేద పం డితులు వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. స్వయంభూ ప్రధానాలయ ముఖ మం డపంలో ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదిక పై తీర్చిదిద్దారు. అర్చక బృందం, వేద పండితులు స్వామి, అమ్మవార్ల సహస్ర నామ పఠనంతో వివిధ రకాల పూలతో పాంచరాత్రగమశాస్త్ర ప్రకారం సుమారు రెండు గంటల పాటు లక్షపుష్పార్చన చేశారు. తెల్లవారు జామునే ఆలయం తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామి వారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. శ్రీస్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, శ్రీఆంజనేయస్వామివారికి సహస్ర నామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాల ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. సాయంత్రం వేళలో శ్రీస్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి వేళలో శ్రీస్వామివారి తిరువారాధన చేపట్టి, స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, శ్రీఆంజనేయ స్వామివారికి సహస్రనామార్చన జరిపారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను ద్వివ మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణతంతు నిర్వహించారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉద యం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలను కలుపుకుని స్వామివారి ఖజానాకు రూ.20,88,907 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈవో వెంకట్రావు తెలిపారు.

# ఢిల్లీ ఆగ్రా ఎక్స్‌ప్రెస్ హైవేపై ఘోర ప్రమాదం..

## పొగమంచు కారణంగా బస్సులు ఢీకొని మంటలు, 4 మంది మృతి

:ఢిల్లీ ఆగ్రా ఎక్స్‌ప్రెస్ హైవేపై తెల్లవారుజామున సుమారు నాలుగు గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దట్టమైన పొగమంచు కారణంగా ఒకదానికొకటి ఢీకొన్న నాలుగు బస్సుల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. బస్సులతో పాటు సమీపంలో ఉన్న కొన్ని ఇతర వాహనాలు కూడా మంటల్లో చిక్కుకున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ ఇంజన్లు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేస్తున్నాయి. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం కారణంగా ఢిల్లీ?ఆగ్రా ఎక్స్‌ప్రెస్ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించడంతో పాటు ప్రమాద కారణాలపై విచారణ చేపట్టారు. దట్టమైన పొగమంచులో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# కామ్ గా కానిచ్చేస్తున్నారు...

కాకినాడ,డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి)

జనసేన ఒకరకంగా సైలెన్స్ గా ఉంది. క్యాడర్ నుంచి నేతల వరకూ అందరూ నోటికి తాళం వేసుకున్నట్లే కనిపిస్తుంది. ఎవరు ఏమనుకున్నా ఇంతకు ముందు కనిపించిన జోష్ నేడు జనసేనలో కనిపించకపోవడం ప్రతి ఒక్కరూ పసిగట్టే ఉంటారు. ఎందుకంటే గత రెండేళ్ల నుంచి నామినేటెడ్ పదవుల విషయంలోనూ, నియోజకవర్గాల్లో తమను టీడీపీ నేతలు పట్టించుకోకపోవడం ఈ సైలెన్స్ కు ముఖ్యకారణమని చెప్పాలి. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై ప్రత్యర్థులు చేసే విమర్శలకు కూడా ఎవరూ పెద్దగా స్పందించడం లేదు. గతంలో సోషల్ మీడియాలోనూ, వివిధ వేదికల ద్వారా పవన్ కల్యాణ్ పై ఈగవాలినా స్పందించే వారు నేడు పెదవి విప్పడానికి సిద్ధపడటం లేదు. ఈ విషయాన్ని పవన్ కల్యాణ్ గమనించి ఉండవచ్చు. గమనించినా పట్టించుకోకపోయి ఉండవచ్చు. నిన్న కాక మొన్న కోనసీమ కొబ్బరి విషయంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ నేతలు సీరియస్ గా స్పందించినా దానిని ఖండించడానికి మంత్రి నాదెండ్ల మనోహర్ మినహా మరొక నేత ముందుకు రాలేదు. అందులోనూ కోనసీమ నుంచి ఎవరూ ఖండించకపోవడం కూడా గమనించాల్సిన విషయం. ఇక సోషల్ మీడియాలోనూ పవన్ కు అనుకూలంగా పెద్దగా పోస్టులు కనిపించడం లేదు. గతంలో ఇరగబడి పోస్టులు పెట్టి తమ అభిమాన నేతపై మాట పడనివ్వకుండా చేసిన వారు సయితం ఇప్పుడు చేతులు కట్టుకుని కూర్చుని ఉండటం డేంజర్ సిగ్నల్స్ అని చెప్పాలి. 2024 ఎన్నికలకు ముందు.. తర్వాత జనసేనలో పరిస్థితులు మారిపోయాయి. పవన్ కల్యాణ్ తో పాటు ఇద్దరు మంత్రులను పక్కన పెడితే దాదాపు పద్దెనిమిది మంది శాసనసభ్యులున్నారు. ఇద్దరు ఎంపీలున్నారు. వారు కూడా నోరు మెదపడం లేదు. అలాగే కొందరు కరడు గట్టిన జనసేన క్యాడర్ గతంలో సోషల్ మీడియాలో యాక్టివ్ గా కనిపించేవారు.

# భద్రచలంలో పెరిగిన చలి తీవ్రత



భద్రాచలం డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి)

రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు అతి తక్కువ స్థాయిలో నమోదు కావడంతో చలి తీవ్రత పెరిగి ప్రజలు చలికి గజగజ వణుకుతున్నారు.పిల్లలు పెద్దలు చలిమంటలకు స్వెట్టర్ లకు అతుక్కుపోతున్నారు . ఉదయం 9 గంటలు అవుతున్నా సూర్యుడు రాక మంచు దుప్పటి లో మిణుకు మిణుకు మంటూ గడుపుతున్నారు ప్రజానీకం.గత రెండు రోజులుగా భద్రాచలం పట్టణంలో మంచు తీవ్రస్థాయిలో పడుతూ,బ్రిడ్జి మీద వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది.వాహనాల లైట్లు వేసుకున్నా ఎదురుగా వచ్చే వాహనాలు కనబడని పరిస్థితి నెలకొంది. .బ్రిడ్జి చెక్ పోస్ట్ వద్ద పార్క్ వద్ద కరకట్ట ప్రాంతంలో రామాలయం పరిసర ప్రాంతాల్లో మంచు బాగా కురుస్తుండడంతో రామాలయ ప్రాంగణాలు కనిపించే పరిస్థితి లేదు.రామాలయ స్నానఘట్టాలు,గోదావరి మాతా విగ్రహం,అభయాంజనేయ స్వామి ఆలయం,కళ్యాణ కట్ట మంచు కప్పేసి గోదావరి నది కూడా ఉందా లేదా అన్నట్టు గా ఉంది.భద్రాచలం పట్టణం నాలుగు వైపులా మంచు కురుస్తూ కొంత ఆహ్లాదకరంగా ఉన్నా,మరోపక్క వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతుంది.బ్రిడ్జి మీద వచ్చే పోయే వాహనాలు ఉదయం 8 గంటల వరకు లైట్లు వేసుకుని ప్రయాణం జాగ్రత్తగా చేయాల్సి వస్తుంది. రామాలయ ప్రాంగణాలు అన్ని

# ఫ్రీ క్యాన్సర్ వ్యాక్సిన్

మాస్కో,డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి)

క్యాన్సర్.. ప్రస్తుతం సమాజంలో వేగంగా విస్తరిస్తున్న వ్యాధుల్లో ఇదీ ఒకటి. మారుతున్న జీవనశైలి.. ఆహారపు అలవాట్లు, వాతావరణ పరిస్థితుల కారణంగా స్త్రీపురుష బేధం లేకుండా.. వయసుతో సంబంధం లేకుండా.. క్యాన్సర్ విస్తరిస్తోంది. ఇప్పటి వరకు చికిత్స తప్ప నివారణ లేని వ్యాధి. అయితే దీనికి రష్యా శుభవార్త చెప్పింది. క్యాన్సర్ నివారణకు వ్యాక్సిన్ అభివృద్ధి చేసినట్లు అధికారికంగా ప్రకటించింది. త్వరలో ప్రపంచవ్యాప్తంగా ఉచితంగా అందిస్తామని కూడా తెలిపింది. ఈ ఆవిష్కరణ ఆరోగ్య రంగంలో భారీ మలుపును తీసుకురావచ్చు.ఈ వ్యాక్సిన్ ఎమ్ఆర్ఎన్ఏ సాంకేతికతపై ఆధారపడి రూపొందించబడింది, ఇది శరీరంలో క్యాన్సర్ కణాలను గుర్తించి నశింపజేసే రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. మెలనోమా, లంగ్ క్యాన్సర్, ప్యాన్క్రియాస్ వంటి ఆరు ముఖ్య రకాలపై ప్రధానంగా పనిచేస్తుంది. రష్యా గమాలేయా జాతీయ ఎపిడెమాలజీ ? మైక్రోబయాలజీ రీసెర్చ్ సెంటర్‌లో అభివృద్ధి చేసిన ఈ వ్యాక్సిన్‌కు 'ఫ్యూచర్?వీ' అనే పేరు ప్రతిపాదించారు.మొదటి, రెండవ దశ ట్రయల్స్‌లో 100 మంది పైగా రోగులపై పరీక్షలు విజయవంతమయ్యాయి. ట్యూమర్ పరిమాణం 30?50% తగ్గడం, రోగ నిరోధకత పెరగడం గమనించారు. మూడవ దశ 2026లో ప్రారంభం కానుంది, ఇందుకు డబ్ల్యూహెచ్‌వో, ఈఎంఏ ఆమోదాలు కోరుతున్నారు.2026 చివరి నుంచి ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ వ్యాక్సిన్ ఉచితంగా అందజేయనున్నారు. రష్యా ప్రభుత్వం, గమాలేయా సెంటర్, అంతర్జాతీయ సంస్థల సహకారంతో 10




కోట్ల డోసులు ఉత్పత్తి చేయబడతాయి. దిగువ ఆదాయ వర్గాలు, అభివృద్ధి చెడుతున్న దేశాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపింది. భారత్, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలతో ఒప్పందాలు కుదిరినట్లు వెల్లడించింది. మరోవైపు ప్రపంచ ఆరోగ్య సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి, కానీ పూర్తి డేటా ప్రచురణకు ఆందోళన వ్యక్తం చేశాయి. పేటెంట్ హక్కులు, ఉత్పత్తి సామర్థ్యం ప్రధాన సవాళ్లు. విజయం సాధిస్తే, క్యాన్సర్ మరణాలు 40% తగ్గవచ్చని నిపుణులు అంచనా.ఈ వ్యాక్సిన్ విస్తరణతో క్యాన్సర్ చికిత్స ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. పర్సనలైజ్డ్ మెడిసిన్‌కు మార్గం సుగమం అవుతుంది. మరిన్ని ట్రయల్స్ జరిగిన తర్వాత పూర్తి అమలు సాధ్యమవుతుంది.

## ప్రియాంక గాంధీతో
# పీకే మంతనాలు





న్యూఢిల్లీ, డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి)

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు ఉండరు, శాశ్వత శత్రువులు ఉండరు.. ఉండేది కేవలం శాశ్వత ప్రయోజనాలు మాత్రమే. ఈ నానుడిని నిజం చేస్తూ.. ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ తాజాగా కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీతో భేటీ కావడం దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఒకప్పుడు కాంగ్రెస్ నాయకత్వంపై అసహనంతో సొంత కుంపటి పెట్టుకున్న పీకే, ఇప్పుడు మళ్లీ అదే పార్టీ గడప తొక్కడానికి ప్రధాన కారణం.. ఇటీవలి బీహార్ ఎన్నికల ఫలితాలే అని చెప్పొచ్చు. ఇటు కాంగ్రెస్, అటు జన్ సురాజ్.. రెండూ ఘోర పరాజయాన్ని చవిచూసిన వేళ, ఈ కలయిక భవిష్యత్ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చబోతోందా అనే ఆసక్తి నెలకొంది.పీకే ? ప్రియాంకల భేటీకి కారణం బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ప్రశాంత్ కిశోర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా స్థాపించిన జన్ సురాజ్ పార్టీకి బీహార్ ప్రజలు గట్టి షాక్ ఇచ్చారు. మొత్తం 238 స్థానాల్లో పోటీ చేస్తే, ఒక్క సీటు కూడా గెలవకపోగా.. ఏకంగా 236 చోట్ల డిపాజిట్లు గల్లంతయ్యాయి. "వ్యూహకర్తగా గెలిపించడం వేరు.. నాయకుడిగా గెలవడం వేరు" అనే సత్యాన్ని ఈ ఫలితాలు పీకేకి రుచి చూపించాయి.మరోవైపు కాంగ్రెస్ పరిస్థితి కూడా అంతకంటే భిన్నంగా ఏమీ లేదు. మహాకూటమిలో భాగంగా 61 సీట్లలో పోటీ చేసిన హస్తం పార్టీ, కేవలం 6 సీట్లకే పరిమితమైంది. ఈ ఫలితాలు రెండు పార్టీల అస్తిత్వాన్నే ప్రశ్నించేలా మారాయి. ఈ నేపథ్యంలోనే, ఇద్దరు పరాజితులు కలిసి భవిష్యత్ ప్రయాణం సాగించాలనే నిర్ణయానికి వచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.నిజానికి ప్రశాంత్ కిశోర్ కాంగ్రెస్ గూటికి చేరడం ఇది కొత్తేమీ కాదు. జేడీయూ నుంచి బయటకు వచ్చాక, ఆయన కాంగ్రెస్ పార్టీ పునరుజ్జీవనం కోసం ఒక బృహత్తర ప్రణాళికను సోనియా గాంధీకి సమర్పించారు. గాంధీ కుటుంబం కాని వ్యక్తికి పార్టీ పగ్గాలు అప్పజెప్పడం దగ్గరి నుంచి, సంస్థాగత నిర్మాణం వరకు అనేక సంచలనాత్మక మార్పులను ఆయన సూచించారు. అయితే, సోనియా గాంధీ ఆ నివేదిక పరిశీలనకు ఒక కమిటీని వేసి, పీకేను ఆ కమిటీలో ఒక సభ్యుడిగా చేరమన్నారు. కానీ, నిర్ణయాధికారాలు లేని కమిటీలో ఉండలేనని, తనకు ఫ్రీ హ్యాండ్ కావాలని పీకే పట్టుబట్టడంతో ఆ చర్చలు విఫలమయ్యాయి. ఆ తర్వాతే ఆయన జన్ సురాజ్ యాత్రను ప్రారంభించారు.సోనియా గాంధీ హయాంలో విఫలమైన చర్చలు, ఇప్పుడు ప్రియాంక గాంధీ చొరవతో మళ్లీ చిగురించడం ఆసక్తికరం. ప్రస్తుతం కాంగ్రెస్ లో రాహుల్ గాంధీ తర్వాత అత్యంత క్రియాశీలకంగా ఉన్నది ప్రియాంకే. ఆమెతో పీకే భేటీ అవ్వడం వెనుక రెండు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సొంత పార్టీని నిర్మించి, క్యాడర్ ను తయారు చేసుకోవడం ఎంత కష్టమో పీకేకి బీహార్ ఎన్నికలు అర్థం చేయించాయి. ఇప్పటికే బలమైన ఓటు బ్యాంకు, చరిత్ర ఉన్న కాంగ్రెస్ లాంటి ప్లాట్ ఫామ్ పై తన వ్యూహాలను అమలు చేయడం సులువని ఆయన భావిస్తుండవచ్చు. వరుస ఓటములతో కునారిల్లుతున్న కాంగ్రెస్ కు, కేవలం సిద్ధాంతాలు మాత్రమే సరిపోవు.. గెలిచే వ్యూహం కావాలి. ఆ లోటును భర్తీ చేయగల సత్తా పీకేకి ఉందని అధిష్టానం నమ్ముతోంది.తాజా సమాచారం ప్రకారం, ప్రశాంత్ కిశోర్ మళ్లీ కాంగ్రెస్ కోసం పనిచేసేందుకు కొన్ని తాజా ప్రతిపాదనలతో వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఈసారి ఆయన పాత్ర కేవలం ఎన్నికల వ్యూహకర్త గా ఉంటుందా? లేక పార్టీలో చేరి కీలక పదవిని చేపడతారా? అన్నది తేలాల్సి ఉంది. జన్ సురాజ్ ను కాంగ్రెస్ లో విలీనం చేస్తారా అనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో, టికెట్ల కేటాయింపులో తనకు స్పష్టమైన పాత్ర కావాలని పీకే కోరుతున్నట్లు సమాచారం.మొత్తానికి, బీహార్ ఎన్నికల ఫలితాలు ప్రశాంత్ కిశోర్ కు వాస్తవికతను, కాంగ్రెస్ కు అనివార్యతను గుర్తుచేశాయి. ప్రశాంత్ కిశోర్ దగ్గర బ్లూ ప్రింట్ ఉంది, కాంగ్రెస్ దగ్గర బ్రాండ్ ఉంది. ఈ రెండూ కలిస్తేనే బీజేపీ వంటి బలమైన శక్తిని ఎదుర్కోగలమని ఇరువురూ గ్రహించినట్లు కనిపిస్తోంది. ప్రియాంక గాంధీతో జరిగిన ఈ భేటీ.. కేవలం చర్చలకే పరిమితమవుతుందా లేక కాంగ్రెస్ వార్ రూమ్ లో పీకే మళ్లీ చక్రం తిప్పుతారా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.



**2029 సార్వత్రిక ఎన్నికల్లో తాము పోటీలో ఉంటామని స్పష్టం చేశారు. సోమవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) వేదికగా 'ఆస్క్ కవిత' హ్యాష్‌ట్యాగ్‌పై నెటిజన్లు అడిగిన ప్రశ్నలకు ఆమె నిశితంగా సమాధానాలు ఇచ్చారు.కొత్త పార్టీ స్థాపనపై అడిగిన ప్రశ్నకు కవిత ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. 2029 ఎన్నికల్లో పోటీ చేస్తామని స్పష్టం చేసిన ఆమె.. పార్టీ పేరును ప్రజలు సూచించిన దానినే పెడతామన్నారు.**

# పోటీకి సిద్ధమవుతున్న కవిత పార్టీ

హైదరాబాద్,డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి)

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, 2029 ఎన్నికల్లో తాము పోటీ చేస్తామని.. పార్టీకి మాత్రం ప్రజలు సూచించిన పేరును మాత్రమే పెడతామన్నారు. 'ఆస్క్ కవిత' ఇంటరాక్షన్‌లో పాల్గొన్న ఆమె, యువతకు ఉద్యోగాలు కల్పించడమే తన ప్రథమ ప్రాధాన్యమన్నారు. కాంగ్రెస్ పాలన హామీలను నెరవేర్చడంలో 'అట్టర్ ఫ్లాప్' అయ్యిందని.. ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు ఆత్మహత్యలు, సింగరేణి నిర్లక్ష్యంపై ప్రభుత్వంపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. వ్యక్తిగత అంశాల్లో, తాను చిరంజీవి అభిమానిని అని తెలిపారు.తెలంగాణ రాజకీయాల్లో రాబోయే కాలంలో కీలక పరిణామాలు చోటు చేసుకోబోతున్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంకేతాలు ఇచ్చారు. సామాజిక తెలంగాణను తమ ప్రధాన లక్ష్యంగా ప్రకటించిన ఆమె.. 2029 సార్వత్రిక ఎన్నికల్లో తాము పోటీలో ఉంటామని స్పష్టం చేశారు. సోమవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) వేదికగా 'ఆస్క్ కవిత' హ్యాష్‌ట్యాగ్‌పై నెటిజన్లు అడిగిన ప్రశ్నలకు ఆమె నిశితంగా సమాధానాలు ఇచ్చారు.కొత్త పార్టీ స్థాపనపై అడిగిన ప్రశ్నకు కవిత ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. 2029 ఎన్నికల్లో పోటీ చేస్తామని స్పష్టం చేసిన ఆమె.. పార్టీ పేరును ప్రజలు సూచించిన దానినే పెడతామన్నారు. యువత, మహిళలకు రాజకీయ అవకాశాలు కల్పించేందుకు జాగృతి కృషి చేస్తుందన్నారు. యువత తమకు నచ్చిన రంగాల్లో అవకాశాలు పొందాలని.. అందుకు వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉద్యోగాలు, స్కిల్, భద్రత ఈ మూడింటిలో దేనికి ప్రాధాన్యం ఇస్తారని ప్రశ్నించగా.. యువతకు ఉద్యోగాలు కల్పించడమే తన ప్రథమ ప్రాధాన్యమని కవిత తేల్చిచెప్పారు. జాగృతిని బలంగా తయారు చేసి, త్వరలోనే మెంబర్‌షిప్ డ్రైవ్ ప్రారంభిస్తామని చెప్పారు.ప్రస్తుతం తెలంగాణలో కొనసాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై కవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం 'అట్టర్ ఫ్లాప్' అయ్యిందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు చదువులకు దూరం కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రైతుల ఆత్మహత్యలు చాలా బాధాకరమని అన్నారు.ఫార్మా సిటీ కోసం తీసుకున్న భూముల్లో ఫ్యూచర్ సిటీ అంటూ హడావుడి చేయటంపై మండిపడ్డారు. త్వరలోనే అక్కడి రైతులకు మద్దతుగా పోరాటం చేస్తామని ప్రకటించారు. సింగరేణి సంస్థను తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. హెచ్ఎంఎస్‌తో కలిసి ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. హైదరాబాద్‌లో వెస్ట్ సిటీపై పెట్టిన శ్రద్ధ ఈస్ట్ సిటీని, అభివృద్ధి చేయటంలో పెట్టలేదని, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని కవిత విమర్శించారు.కవిత తన వ్యక్తిగత అభిరుచులకు సంబంధించిన ప్రశ్నలకు కూడా సమాధానం ఇచ్చారు. తాను చిరంజీవి అభిమానిని అని స్పష్టం చేశారు. నటుడు రామ్‌చరణ్ చాలా హంబుల్‌గా ఉండే మంచి డ్యాన్సర్ అని చెబుతూనే.. చిరంజీవి తర్వాతే రామ్‌చరణ్ అని సరదాగా పేర్కొన్నారు. చిన్నప్పుడు ఎర్రమంజిల్‌లో గడిపిన క్షణాలు తనకు అత్యంత సంతోషాన్ని ఇచ్చాయని తెలిపారు.

# ఆ రెండు పదవుల కోసం డజను మంది

హైదరాబాద్, డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి)

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయింది. ఇప్పటి వరకూ రెండుసార్లు మంత్రి వర్గ విస్తరణ జరిగింది. ఇంకా రెండు మంత్రి పదవులు రేవంత్ రెడ్డి కేబినెట్ లో ఖాళీగా ఉన్నాయి. ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ముందు మహ్మద్ అజారుద్దీన్ ను ఒక్కరే మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. మరో రెండు పదవులు రెండేళ్లుగా ఖాళీగా ఉన్నాయి. దీంతో మంత్రి వర్గ విస్తరణ జరపాలని పార్టీ రాష్ట్ర నేతలు భావిస్తున్నారు. మరో మూడేళ్లు మాత్రమే సమయం ఉండటంతో మంత్రివర్గ విస్తరణ చేయకుండా నాన్చడం భావ్యం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా గత రెండు, మూడు రోజుల నుంచి ఢిల్లీలోనే ఉండి పార్టీ పెద్దలను కలసి మంత్రి వర్గ విస్తరణపై చర్చించినట్లు సమాచారం.తెలంగాణ పర్యాటకం మంత్రి వర్గ విస్తరణ చేయాలంటే ముందుగా మంత్రివర్గంలోనూ కొంత ప్రక్షాళన చేయాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలియవచ్చింది. కొందరికి రెండేళ్లపాటు మంత్రిపదవిగా అవకాశమిచ్చినందున మరికొందరికి అవకాశం ఇవ్వాలంటే మంత్రివర్గ ప్రక్షాళన చేయాలని ఆయన నిర్ణయం తీసుకున్నారని సమాచారం. కొందరిని మంత్రి వర్గం నుంచి తప్పించి మరికొందరికి సామాజికవర్గం, ప్రాంతాలకు తగినట్లుగా మంత్రి వర్గం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. హైకమాండ్ మాత్రం ఇందుకు అంగీకరించిందా? లేదా? అన్నది తెలియక రాకపోయినా పంచాయతీ ఎన్నికలు ముగిసిన తర్వాత మంత్రి వర్గ విస్తరణ చేపడితేనే రానున్న ఎన్నికలకు తన టీం ను సిద్ధం చేసుకోవాలన్నది రేవంత్ ఆలోచనగా ఉంది.ఉన్న మంత్రివర్గంలో సభ్యులను అలాగే ఉంచి కేవలం ఖాళీగా ఉన్న మంత్రి పదవులను భర్తీ చేసినట్లయితే ఆశావహుల్లో మరింత నిరాశ ఎదురవుతుందని రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతల అభిప్రాయంగా కూడా ఉంది. ఖాళీగా ఉన్న మంత్రి పదవులు రెండింటితో పాటు మరో నలుగురిని అయినా తప్పించగలిగితే ఆరుగురికి కొత్త వారికి అవకాశం దక్కుతుందని, అప్పుడు ఎలాంటి అసంతృప్తులు ఉండవన్న అంచనాలో ఉన్నారు. కానీ హైకమాండ్ ఇంత వరకూ దీనిపై ఎలాంటి అనుమతి ఇవ్వలేదని తెలిసింది.

# సానుభూతి మంత్రంతో రేవంత్



హైదరాబాద్, డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి)

ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం లేదు. పరిపాలన కూడా సరిగ్గా లేదు. అధిష్టానం ఏమాత్రం స్వేచ్ఛ ఇవ్వడం లేదు. అభివృద్ధి ఆగిపోయింది. అప్పులు తేవడం పెరిగిపోయింది. 10 సంవత్సరాల కాలంలో తెలంగాణ విపరీతంగా అభివృద్ధి చెందితే.. ఇప్పుడు మాత్రం నేల చూపులు చూస్తోంది'' ఇదిగో ఇలా సాగిపోతోంది గులాబీ పార్టీ విమర్శల వ్యవహారం. సోషల్ మీడియా ద్వారా రేవంత్ రెడ్డిని తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతోంది. రేవంత్ వేసే ప్రతి అడుగును భూతద్దంలో పెట్టి చూస్తోంది గులాబీ సోషల్ మీడియా. ఈ స్థాయిలో విమర్శలు.. స్వపక్షం నుంచి ఒత్తిడి.. అధిష్టానం నుంచి అంతగా లభించని సపోర్టు.. ఇన్ని ప్రతికూలతల మధ్య రేవంత్ రెడ్డి పడుతున్న ఇబ్బందులు మామూలువి కాదు. ఇన్ని సమస్యలు ఎదుర్కొంటూనే పరిపాలన సాగిస్తున్నారు రేవంత్ రెడ్డి. వాస్తవానికి అతని స్థానంలో మరొక నాయకుడు ఉండి ఉంటే పరిస్థితి మరో విధంగా ఉండేది.. కాంగ్రెస్ పార్టీ నాలుగు ముక్కలయ్యేది. తనకున్న చాకచక్యంతో.. పరిజ్ఞానంతో ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నారు రేవంత్ రెడ్డి.. ఆయన పరిపాలనలో లోపాలు లేవా? ప్రజలకు అంతా మంచే జరుగుతోందా? ప్రభుత్వం నుంచి ప్రజలకు బ్రహ్మాండమైన సహకారం లభిస్తోందా? ఈ ప్రశ్నలకు లేదు అని, కాదు అని సమాధానం రావచ్చు. అందులో అనుమానం కూడా లేదు. కాకపోతే ఇన్ని ప్రతికూలతల మధ్య.. రేవంత్ రెడ్డి పరిపాలన సాగించడమే అసలైన ఆశ్చర్యకరమైన విషయం. ముఖ్యమంత్రి అయిన తర్వాత తీసుకున్న నిర్ణయాలు కొన్ని వివాదాస్పదంగా మారాయి. మంత్రుల వ్యవహార శైలి కూడా ఇబ్బందికరంగా మారింది.. ఇవన్నీ ప్రతిపక్ష గులాబీ పార్టీకి అనుకూలంగా మారాయి. అయితే ఇన్ని అవరోధాలు ఉన్నప్పటికీ.. రేవంత్ రెడ్డి పరిపాలన రథాన్ని సవ్యంగా ముందుకు సాగించడమే ఇక్కడ అసలైన గొప్ప విషయం. ఎందుకంటే గులాబీ పార్టీ సోషల్ మీడియా బలంగా ఉంది. ఆ పార్టీ మొత్తాన్ని కేటీఆర్ నడిపిస్తున్నారు. ఆర్థికంగా గులాబీ పార్టీకి బలం విపరీతంగా ఉంది. అధికార కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా నుంచి మొదలు పెడితే నాయకుల వరకు అన్ని లోపాలు కనిపిస్తున్నాయి. అయినప్పటికీ రేవంత్ రెడ్డి వీటన్నింటిని దాటుకొని అటు పార్టీని.. ఇటు ప్రభుత్వాన్ని ముందు వరుసలో నిలపడమంటే మామూలు విషయం కాదు. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో వరస విజయాలను సాధిస్తుంది.. తెలంగాణలో చెప్పుకునే స్థాయిలోనే మెజారిటీ సాధించిన కాంగ్రెస్ పార్టీ.. ముందుగా కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో విజయం సాధించింది.. ఆ తర్వాత జూబ్లీహిల్స్ ఉపయోగ ఎన్నికల్లో గెలుపును అందుకుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవదని.. ఈ ఉప ఎన్నికలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రెఫరెండం అని కేటీఆర్ పదేపదే వ్యాఖ్యానించారు. కానీ వాస్తవ ఫలితం మాత్రం రేవంత్ రెడ్డికి అనుకూలంగా వచ్చింది. ఒకరకంగా రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ద్వారా అటు కేటీఆర్ కు, ఇటు గులాబీ పార్టీకి ఏకకాలంలో చెక్ పెట్టారు. దానిని మర్చిపోకముందే స్థానిక ఎన్నికల్లో ప్రతిపక్ష గులాబీ పార్టీకి దిమ్మతిరిగే విధంగా సమాధానం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చరిత్రలో కనివిని ఎరుగని స్థాయిలో స్థానిక సంస్థలలో సీట్లు సాధించి సరికొత్త రికార్డు సృష్టించారు. తద్వారా గులాబీ పార్టీ తనపై పదే పదే చేస్తున్న నెగిటివ్ ప్రచారాన్ని తిప్పికొడుతున్నారు రేవంత్ రెడ్డి. ప్రజల ముందు సానుభూతి మంత్రాన్ని పఠిస్తూ సరికొత్త రాజకీయ నాయకుడిగా అవతరిస్తున్నారు.. తెలంగాణ ప్రజల్లో పాజిటివిటీ పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు.

# కాంగ్రెస్ కు డేంజర్ బెల్స్

హైదరాబాద్, డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి)

తెలంగాణ వ్యాప్తంగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు అధికార కాంగ్రెస్ పార్టీకి ఊరటను ఇస్తూనే, అంతర్లీనంగా తీవ్రమైన హెచ్చరికలను కూడా జారీ చేశాయి. ఇప్పటివరకూ వెలువడిన రెండు విడతల ఫలితాలను పరిశీలిస్తే, అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని కాంగ్రెస్ అగ్రస్థానంలో నిలిచిన మాట వాస్తవమే. కానీ, క్షేత్రస్థాయిలో చోటుచేసుకున్న పరిణామాలు, గణాంకాలను లోతుగా విశ్లేషిస్తే.. అధికార పార్టీ సాధించిన ఈ విజయం బలుపు కాదని, కేవలం వాపు మాత్రమేనన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. సాధారణంగా ఏ రాష్ట్రంలోనైనా అధికారంలో ఉన్న పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్ష విజయాలు దక్కడం పరిపాటి. అభివృద్ధి నిధులు, ప్రభుత్వ పథకాలు అధికార పార్టీ మద్దతుదారులకే అందుతాయన్న నమ్మకంతో గ్రామీణ ఓటర్లు అధికార పక్షం వైపు మొగ్గు చూపుతారు. ఈ కోణంలో చూస్తే కాంగ్రెస్ పార్టీ స్వీప్ చేయాల్సి ఉంది. కానీ, తాజా ఫలితాలు ఆ అంచనాలను తారుమారు చేశాయి. కాంగ్రెస్ పార్టీ సుమారు 50 శాతం స్థానాల్లో విజయం సాధిస్తే, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ 40 శాతానికి పైగా స్థానాల్లో గెలుపొందడం గమనార్హం. కేవలం 10 శాతం ఓట్ల తేడా మాత్రమే ఉండటం అధికార పార్టీ డొల్లతనాన్ని బయటపెడుతోంది. కాంగ్రెస్ విజయం వెనుక ఆ పార్టీ సంస్థాగత బలం కంటే, 'అధికారంలో ఉన్నాం' అన్న సానుకూలత మాత్రమే ఎక్కువగా పనిచేసిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలో లేకపోయి ఉంటే, ఈ ఫలితాలు పూర్తిగా భిన్నంగా ఉండేవని అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికలు మిగిల్చిన అతిపెద్ద ఆందోళన.. మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరు. రాష్ట్రంలో చక్రం తిప్పుతున్నామని భావిస్తున్న పలువురు మంత్రులు, కీలక ఎమ్మెల్యేల సొంత గ్రామాలు, సొంత నియోజకవర్గాల్లోనే కాంగ్రెస్ మద్దతుదారులు ఓటమి పాలయ్యారు. అధికార పార్టీ నేతలు తమ సొంత గడ్డపైనే పట్టు కోల్పోవడం, అక్కడ బీఆర్ఎస్ మద్దతుదారులు జెండా ఎగురవేయడం కాంగ్రెస్ అధిష్టానానికి మింగుడుపడని విషయం. ఇది కేవలం ఓటమి మాత్రమే కాదు,



క్షేత్రస్థాయిలో నాయకత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తికి నిదర్శనం. నేతల అతి విశ్వాసం, గ్రూపు తగాదాలు, క్షేత్రస్థాయి కార్యకర్తలను విస్మరించడం వంటి కారణాలే ఈ ఫలితాలకు దారితీశాయని స్పష్టమవుతోంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఓటముల తర్వాత డీలా పడ్డ బీఆర్ఎస్ శ్రేణులకు ఈ పంచాయతీ ఎన్నికలు టానిక్‌లా పనిచేశాయి. ప్రతిపక్షంలో ఉండి, అధికార పార్టీని ఎదుర్కొని మరీ 40 శాతానికి పైగా స్థానాలను దక్కించుకోవడం ఆషామాషీ విషయం కాదు. గ్రామీణ స్థాయి క్యాడర్ బీఆర్ఎస్‌కు ఇంకా బలంగానే ఉందని ఈ ఫలితాలు రుజువు చేశాయి. కాంగ్రెస్ వైఫల్యాలను, ప్రభుత్వ వ్యతిరేకతను ఓట్లుగా మలుచుకోవడంలో బీఆర్ఎస్ స్థానిక నాయకత్వం సఫలమైంది. ఈ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి కచ్చితంగా ఒక మేలుకొలుపు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతున్నా, క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతపై దృష్టి సారించకపోవడం, నేతల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికిప్పుడు జనం ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకతతో లేకపోయినా, ఈ ఫలితాలు మాత్రం భవిష్యత్తు రాజకీయాలకు ప్రమాద ఘంటికలే. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో ప్రతిపక్షం బలంగా ఉంటే, అది ప్రభుత్వ పథకాల అమలులోనూ, వచ్చే ఎన్నికల్లోనూ అధికార పార్టీకి పెద్ద తలనొప్పిగా మారుతుందిమొత్తానికి, కాంగ్రెస్ సాధించిన ఈ విజయం అంకెల గారడీలో గొప్పగా కనిపించవచ్చు కానీ, వాస్తవంలో అది నిలకడ లేని విజయమని, పార్టీ ఇప్పటికైనా లోపాలను సరిదిద్దుకోకపోతే రానున్న రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# పునర్విభజన రచ్చ...

హైదరాబాద్, డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి)

జీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజనపై అనేక అభ్యంతరాలు వస్తున్నాయి. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మితో హైదరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు సమావేశం అయ్యారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, ప్రకాశ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో కలిసి కార్పొరేటర్లు మేయర్‌ను కలిశారు. డివిజన్ల పునర్విభజనపై చర్చించారుజీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్.. కార్పొరేటర్ల అభిప్రాయాన్ని తీసుకోనున్నారు. ఇప్పటిదాకా 13 వందలకుపైగా అభ్యంతరాలు వచ్చాయి. జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్, జోనల్, సర్కిల్ ఆఫీసుల్లో అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. డిసెంబర్ 17వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. డిసెంబర్ 18వ తేదీన డివిజన్ల పునర్విభజనకు తుది ఆమోదం తెలపాలని జీహెచ్ఎంసీ అనుకుంటోంది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో మేయర్ గద్వాల విజయలక్ష్మి సమావేశమయ్యారు. వార్డుల పునర్విభజన శాస్త్రీయంగా చేయాలని మేయర్‌కు వినతిపత్రం అందించారు. డివిజన్ల పునర్విభజన సరిగా లేదని చాలా మంది విమర్శలు చేస్తున్నారు. ఏ ప్రాంతం డివిజన్‌లో కలుస్తుందనే విషయంపై గందరగోళం నెలకొన్నది. కొత్తగా డివిజన్ల హద్దులు, పేర్లు మార్చడంపై అనేక అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు జీహెచ్ఎంసీలోని డివిజన్ల పెంపును సవాల్ చేస్తూ.. వినయ్ కుమార్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అత్యవసరంగా విచారణ చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. డివిజన్ల పునర్విభజనలో తన అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదన్నారు. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. జీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజనపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. డీ లిమిటేషన్ మీద



అభ్యంతరం తెలిపేందుకు కమిషనర్‌ను కలిశామన్నారు. కనీసం తమకు సమాచారం లేకుండానే.., ఎమ్మెల్యేల అభిప్రాయం లేకుండానే.. డివిజన్ల పునర్విభజన చేశారని పేర్కొన్నారు. తమ అభ్యంతరాలను మేయర్, కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఇచ్చామన్నారు. డివిజన్ల విభజనపై ఎటువంటి సమస్యలు ఉన్నాయనే అంశాలను గుర్తించామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చెప్పారు. కొన్ని డివిజన్లలో ఎక్కువ ఓట్లు మరికొన్ని డివిజన్లలో తక్కువ ఓట్లు గుర్తించామని వెల్లడించారు. అన్ని విషయాలను మేయర్, కమిషనర్లకు వివరించామన్నారు. హద్దులు తెలియకుండా అధికారులు వాటిని ఖరారు చేశారని చెప్పారు.

# రైస్ మిల్లులపై కొరవడిన నిఘా

నిజామాబాద్, డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా బీర్కూర్ నసుల్లాబాద్ మండలంలోని రైస్ మిల్లులపై సంబంధిత అధికారుల నిఘా కరువైంది. ఏకంగా బయట నుంచి ఆటోలో బియ్యం, నూకలు రావడం పట్ల తర్వాత చర్చనీ అంశంగా మారింది. కాగా మధ్యాహ్నం వేళలో ఈ ఆటో రైస్ మిల్ లోకి రాగా అధికారులకు సమాచారం ఇచ్చిన అధికారులు రైస్ మిల్లర్లకు వత్తాసు పలికి కాలయాపన చేసి రాత్రి వరకు ఎలాంటి కేసు నమోదు చేయకపోవడం రైస్ మిల్లు సీజ్ చేయకపోవడం బట్టి చూస్తే అధికారులు రైస్ మిల్లర్లకు ఏ మేరకు వత్తాసు పలుకుతున్నారు ఇట్టే అర్థమవుతుంది రైస్ మిల్లర్లకు పరోక్షంగా వత్తాసు పలుకుతున్నారని అక్రమ దందా చేయడానికి చర్చించుకుంటున్నారు. ఏదైనా సంఘటన జరిగితే వెంటనే స్పందించే అధికారులు అక్కడున్నక్కడున్నాం ఎలక్షన్ డ్యూటీలో ఉన్నామంటూ కాలయాపన చేసి రైస్ మిల్లర్లకు పరోక్షంగా వత్తాసు పలికి ఈ సంఘటన నీరుగారిచేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఏదైనా రైస్ మిల్లులో బయటనుంచి ఒక్క ఎత్తు వచ్చిన దానిని వెంటనే సీజ్ చేయాల్సిన సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో కాలయాపన చేసి రేపు మాకు అంటూ ఏదో వచ్చాం వెళ్ళాం అనే చందంగా మార్చారని సమాచారం. నసురుల్లాబాద్, బీర్కూరు రైస్ మిల్లులపై అనేక కథనాలు వచ్చిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని, దీంతో రైస్ మిల్లల్లో అక్రమాలు అనేకంగా చోటు చేసుకుంటున్నాయి. అక్రమ దందా దర్జాగా కొనసాగుతున్న సంబంధిత క్షేత్రస్థాయి అధికారులు, జిల్లా స్థాయి అధికా రులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక అసలు మతల అర్థమవుతుందని ఆయా మండలాల వాసులు చర్చించుకుంటున్నారుబయటనుంచి వచ్చిన ఆటోలో సుమారు పాతికకు పైగా సంచుల్లో బియ్యం నూకలు ఉండగా అధికారులు బయటకు వెళ్లి సాయంత్రం వచ్చేలోపు సంచులు తారుమారు కావడంతో పాటు మొత్తం నూకలు ఉన్నట్లు రైస్ మిల్లులో తారుమారు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. ముందుగా రెవెన్యూ అధికారులు సీజ్ చేస్తామని చెప్పి కామారెడ్డి నుంచి ఉన్నతాధికారులు వస్తున్నారని కాలయాపన చేయడం వెనుక అసలు మతల ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిని బట్టి చూస్తే రైస్ మిల్లులో అక్రమాలు ఏ మేరకు జరుగుతున్నాయో అధికారులు ఎలాంటి నిఘా వేశారో ఇట్టే అర్థమవుతుందని తెలుస్తోంది. ఇప్పటికైనా నసురుల్లాబాద్ బీర్కూరు రైస్ మిల్లులపై ప్రత్యేక టీం ద్వారా ఏర్పాటు చేస్తే అసలు వాస్తవాలు బహిర్గతం అవుతాయని అక్రమాలు జరిగిన రైస్ మిల్లులను సీజ్ చేయడం కేసులు నమోదు చేయకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని కంచే చేను మేసిన చందంగా సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. బయటనుంచి ఆటోలో ఒక్క గింజ కూడా వస్తే రైస్ మ్మి చర్యలు తీసుకుంటున్నామన్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు అని సంఘటన జరిగి ఒకరోజు గడిచిన కాలయాపన చేశారని తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ఈ సంఘటనపై చర్యలు తీసుకుంటారా చూసి చూడనట్లు వ్యవహరిస్తూ ఆయా మండలాల్లో రైస్ మిల్లులలో అక్రమాలు జరిగేలా వత్తాసు పలుకుతారా వేచి చూడాలని ఆయా మండలాల వాసులు అభిప్రాయపడుతున్నారు.



రైస్ మిల్లులో అక్రమాలు ఏ మేరకు జరుగుతున్నాయో అధికారులు ఎలాంటి నిఘా వేశారో ఇట్టే అర్థమవుతుందని తెలుస్తోంది. ఇప్పటికైనా నసురుల్లాబాద్ బీర్కూరు రైస్ మిల్లులపై ప్రత్యేక టీం ద్వారా ఏర్పాటు చేస్తే అసలు వాస్తవాలు బహిర్గతం అవుతాయని అక్రమాలు జరిగిన రైస్ మిల్లులను సీజ్ చేయడం కేసులు నమోదు చేయకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని కంచే చేను మేసిన చందంగా సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. బయటనుంచి ఆటోలో ఒక్క గింజ కూడా వస్తే రైస్ మ్మి చర్యలు తీసుకుంటున్నామన్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు

# హైదరాబాద్ జూకు కంగారూలు, జీబ్రాలు

హైదరాబాద్, డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి)




నెహ్రూ జూలాజికల్ పార్క్‌ను సందర్శించే పిల్లలు, కుటుంబాలు, వన్యప్రాణి ప్రేమికులు త్వరలో మొదటిసారిగా కంగారూలను చూడబోతున్నారు. జంతు మార్పిడి కార్యక్రమంలో భాగంగా ఈ ఆస్ట్రేలియా జాతి జంతువులను తీసుకురావడానికి హైదరాబాద్ జూ సిద్ధమవుతోంది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో రిలయన్స్ ఫౌండేషన్ నడుపుతున్న అంతర్జాతీయ వన్యప్రాణుల రక్షణ, పరిరక్షణ కేంద్రమైన వంతారా నుండి ఒక జత కంగారూలను తీసుకురానున్నారు. వాటి కోసం ఎన్‌క్లోజర్లు, రాత్రిపూట నివాస గృహాలను ఇప్పటికే సిద్ధం చేసినట్లు జూ అధికారులు తెలిపారు. వంతారా డైరెక్టర్ బ్రిజ్ కిషోర్ గుప్తా నేతృత్వంలోని ఒక బృందం ఇటీవల హైదరాబాద్ జూలోని సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను తనిఖీ చేసింది.'జూలో కంగారూలు ఉండటం ఇది మొదటిసారి. మేం త్వరలో వంతారా నుండి ఒక మగ, ఒక ఆడ కంగారూను తీసుకుంటాం. అవి వచ్చిన తర్వాత, వాటిని ప్రదర్శనకు ఉంచే ముందు కొన్ని రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచుతాం.' అని నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు చెందిన ఒక సీనియర్ అధికారి తెలిపారు. ఇప్పుడు వంతారా నుంచి వచ్చే కంగారూలకు బదులుగా హైదరాబాద్ జూ నుంచి ఏనుగులలోని ఒకదానిని వంతారాకు పంపనుంది. గతంలో 2020లో జపాన్‌లోని యోకోహామా జూలాజికల్ గార్డెన్స్ నుండి నాలుగు కంగారూలను తీసుకురావాలని హైదరాబాద్ జూ ప్రణాళిక వేసింది. కానీ కొవిడ్-19 మహమ్మారి కారణంగా ఏర్పడిన అంతరాయాల వల్ల ఆ ఒప్పందాన్ని నిలిపివేశారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం జూలో ఒంటరిగా ఉన్న సన్నీ అనే మగ జిరాఫీకి త్వరలో ఒక ఆడ తోడు రానుంది. సీనియర్ అధికారులు ఇటీవల మైసూరు జూను సందర్శించి ఈ మార్పిడిని ఖరారు చేశారు. ఈ నెలాఖరులోగా జిరాఫీ వస్తుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జూలో 2,200 కంటే ఎక్కువ జంతువులు, పక్షులతో పాటు 199 జాతుల జీవులు ఉన్నాయి. త్వరలో జీబ్రాలు కూడా ఇక్కడ మరింత సందడిగా చేయనున్నాయి. జూ త్వరలో వంతారా నుండి ఒక జత జీబ్రాలను తీసుకురానుంది. ఇప్పటికే ఆ కేంద్రం నుండి తీసుకువచ్చిన రెండు మగ, ఒక ఆడ జీబ్రాలతో కలిపి వీటి సంఖ్య పెరుగుతుంది. 37 ఏళ్ల విరామం తర్వాత హైదరాబాద్ జూకు జీబ్రాలు తిరిగి వచ్చాయి.

# అక్కరకు కాని సంక్షేమ పథకాలు

మెదక్, డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి)

రెండు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ సీట్లను హస్తగతం చేసుకున్నామని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు పైకి చెబుతున్నా, అంతర్గతంగా మాత్రం ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ పోరులో బీఆర్ఎస్ గ్రాఫ్ అనూహ్యంగా పెరగడం, రెండు వేలకు పైగా సర్పంచ్ స్థానాలు గెలుచుకోవడంతో కాంగ్రెస్ నాయకుల్లో అంతర్మథనం మొదలైంది. అనుకున్న లక్ష్యానికి ఎందుకు చేరుకోలేపోయామనే అంశంపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించిందిడీసీసీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, క్షేత్రస్థాయిలోకి వెళ్లి సీరియస్‌గా పనిచేయలేదని.. అసంతృప్తులను, అసమ్మతిని బుజ్జగించి దారిలోకి తీసుకురావడంలో డీసీసీ అధ్యక్షులతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ ఇన్‌చార్జ్‌లు, మండల పార్టీ నాయకులువిఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెబల్స్‌ను బుజ్జగించి.. పోటీ నుంచి తప్పించకుండా వదిలేయడం వల్లే పంచాయతీ పోరులో అనుకున్న లక్ష్యం సాధించలేకపోయామనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితి వల్లే ఓట్లు బాగా చీలి బీఆర్ఎస్, బీజేపీ లాభపడ్డాయి అని అంటున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించడంలోనూ వెనకబడిపోయినట్లుగా కాంగ్రెస్ నేతలు గుర్తించినట్లుగా గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. అయితే 70 నుంచి 80 శాతం వరకు సర్పంచ్‌లను గెలుచుకుంటామని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చెబుతున్న విషయం తెలిసిందేకానీ, రెండు విడతల్లో 8,555 గ్రామాల్లో ఎన్నికలు జరుగగా కాంగ్రెస్ పార్టీ 4,579 పంచాయతీల్లో మాత్రమే విజయం సాధించింది. ఇక బీఆర్ఎస్ 2,357, బీజేపీ 457, ఇతరులు 1,162 సర్పంచ్ స్థానాల్లో గెలుపొందారు. రెండు విడతల్లో వచ్చిన ఫలితాలు మూడో విడతలో పునరావృతం కాకుండా జగ్రత్తపడా ల్సిన అవసరం ఉందని, అందుకు ప్రతి నాయకుడు అప్రమత్తంగా ఉండాలని గాంధీభవన్ నుంచి డీసీసీ అధ్యక్షులు, స్థానిక నాయకులకు ఆదేశాలు వెళ్లినట్లుగా తెలిసింది. ఇదే పరిస్థితి కొనసాగితే, త్వరలోనే పార్టీపరంగా జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్, కార్పోరేషన్ల ఎన్నికల్లో నష్టం జరుగుతుందని పార్టీ పెద్దలు హెచ్చరిక కూడా చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ వెయ్యిలోపే సర్పంచ్‌లు గెలుస్తుందని కాంగ్రెస్ నేతలు మొదటి నుం చి భావించారు.

కానీ, ఫలితాలు చూస్తే ఆశ్చర్యపడాల్సిన పరిస్థితి వచ్చిందని వారు చెబు తున్నారు. చాలా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు గట్టిపోటీ ఇచ్చారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థుల తరపున మం త్రులు, కొందరు ఎమ్మెల్యేలతో పాటు డీసీసీ నాయకుల్లో కొందరు పనిచేసినా.. మరికొందరు పెద్దగా దృష్టి సారించలేదని, అందుకే సగం స్థానాలకే పరిమితం కావాల్సి వచ్చిందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ లాంటి సంక్షేమ పథకాలు అందజేస్తున్నా ఫలితాలు ఆశించిన మేర ఫలితాలు రాలేదనే చర్చ జరు గుతోంది. మరోవైపు బీఆర్ఎస్ స్థానిక క్యాడ ర్ పంచాయతీ ఎన్నికలను సవాల్‌గా తీసుకుని.. కాంగ్రెస్‌కు ధీటుగా పనిచేసి 2 వేలకు పైగా సర్పంచ్‌లను గెలిపించుకున్నారని చర్చ జరుగుతోందిబీజేపీ కూడా ఊహించని విధంగా ఫలితాలను సాధించుకుంది. రెండు విడతలు కలిపి 457 పంచాయతీలు గెలవడంపై ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వమే ఆశ్చర్యం వ్యక్తం చేస్తోంది. ఇక స్వతంత్రులు కూడా 1,162 గెలవడం అధికార పార్టీని మరింత ఆందోళనకు గురిచేస్తున్నది.

# ఉపాధి హామీని నిర్వీర్యం చేసే దిశగా కేంద్రం అడుగులు

## బీజేపీయేతర పాలిత రాష్ట్రాలకు మొండి చెయ్యి చూపడానికి కుట్ర

## నూతన బిల్లుపై సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఫైర్



కరీంనగర్, డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి):20 సంవత్సరాల క్రితం సోనియా గాంధీ యుపిఎ చైర్ పర్సన్ గా కేంద్రంలోని యుపీఏ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా గ్రామాలలోని పేదలకు భరోసా కల్పించడానికి మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని, కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నగరంలోని సుడా చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పథకం గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఉపాధి దొరుకుతుందని, పన్నెండు సంవత్సరాలుగా అధికారంలో కొనసాగుతున్న ఎన్డీఏ ప్రభుత్వం ఎఒక్క పథకం తీసుకురాకపోగా మారిన సామాజిక ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేస్తున్నామని పార్లమెంటులో నూతన బిల్లు ప్రవేశపెట్టిన ఎన్డీఏ ప్రభుత్వం అప్పటికి ఇప్పటికీ 20 శాతం నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినప్పటికి కనీసం కూలీ రేటు పెంచాలన్న సోయి కూడా లేదని పని దినాలు కేవలం 25 రోజులు మాత్రమే పెంచారని అన్నారు. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో రకంగా నిర్దిష్ట మొత్తాన్ని కేటాయిస్తామని పేర్కొనడం వెనుక బీజేపేతర రాష్ట్రాల ప్రభుత్వాలకు మొండి చేయి చూపే కుట్ర ఉందని నరేందర్ రెడ్డి ఆరోపించారు. మహాత్మాగాంధీ పేరు తొలగించడంలో ఉన్న శ్రద్ధ పేదలకు న్యాయం చేయాలన్న దాంట్లో లేదని విమర్శించారు. తెలంగాణ లోని కేంద్ర మంత్రులు బీజేపీ ఎంపిలు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో పిట్టల రవీందర్,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,కుర్ర పోచయ్య,దండి రవీందర్,మేకల నర్సయ్య,రమణా రెడ్డి,సుదర్శన్,మేరాజ్,మాసుం ఖాన్, తోట అంజయ్య,బషీర్, పెద్దిగారి తిరుపతి,కొట్టె ప్రభాకర్,అష్రఫ్,బత్తుల రాజ్ కుమార్,బషీర్,భారీ,సాయిరాం, ఉప్పరి అజయ్,యోనా తదితరులు పాల్గొన్నారు.

# రేకుర్తి కంటి ఆసుపత్రికి ఐడిబిఐ బ్యాంకు భారీ విరాళం


## సి ఎస్ ఆర్ కింద 74లక్షల అందజేత

కరీంనగర్, డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి):



వైద్యోనారాయణ హరి అన్నారు పెద్దలు..ఆపదలో ఉన్న రోగులకు పెద్ద దిక్కే వైద్యుడు...ఎంత ఖర్చయినా పర్వాలేదు నా బిడ్డ, తండ్రి, తల్లి, కూతురు, భార్య, భర్త ఇలా ఎవరైనా ఆసుపత్రిలో చేరితే బాధితులు వైద్యుడితే చెప్పే అర్ధనాథాలు ఇవే..ఈ అర్ధనాథలకు దూరంగ సమాజం విలసిల్లాలనే భావనతో (ఐ డి బి ఐ) బ్యాంకు కరీంనగర్ నగరంలోని రేకుర్తిలో గల లయన్స్ క్లబ్ డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఉదార కంటి ఆసుపత్రికి సి ఎస్ ఆర్ కింద 74లక్షల 8వేల 700రూపాయల భారీ విరాళాన్ని అందజేసింది. ఈ విరాళం ద్వార నూతనంగా నిర్మిస్తున్న రెటీనా డిపార్ట్మెంట్ లో మాడ్యులర్ మూడు ఆపరేషన్ థియేటర్లు, అశోక్ ల్యాండ్ బస్ కోసం అందజేసినట్లు సభ్యులు తెలిపారు. ఈ ఆసుపత్రిలో క్యాట్రాక్ట్ ఆపరేషన్లతో పాటు గ్లకోమా, మెల్లకన్ను, రెటీనా సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ప్రతి గురువారం ఎవరు వచ్చిన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని, తెల్ల రేషన్ కార్డు, 50 సంవత్సరాల వయసు తప్పనిసరిగా నిర్ధారించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి చైర్మన్ లయన్ కొండా వేణుమూర్తి మాట్లాడుతూ రెటీనా డిస్పార్టుమెంట్లలో 5కోట్ల రూపాయలతో ఈ సేవలు హైదరాబాదులో మాత్రవే అందుబాటులో ఉన్నాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చిదురు సురేష్, ప్రకాష్ హెుల్లా, బొమ్మ పవన్ కుమార్, ఇంజనీర్ కోలా అన్నారెడ్డి, డాక్టర్ టి. మురళీధర్ రావు, ముక్క శరత్ కృష్ణ, మ్యాడం శివకాంత్ లు పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి వాడోనా గ్రామ అభివృద్ధి చేస్తా: సర్పంచ్ అభ్యర్థి మహాగవాలి సతీష్-దీక్ష.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 16( భారత శక్తి): తానూర్ మండలంలోని వాడోనా గ్రామాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దడమే తన లక్ష్యమని సర్పంచ్ అభ్యర్థి దీక్ష -సతీష్ పటేల్ అన్నారు. వాడోనా గ్రామపంచాయతీ లోని ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందరరేగా ఆమె మాట్లాడుతూ..... గ్రామంలో నెల కొన్నసమస్యలను పరిష్కరించి గ్రామం లోని విద్య, వ్యవసాయం, తాగు నీరు, పచ్చదనం, పరిశుభ్రత, విద్యుత్ దీపాలు, మురికి కాలువల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం చేసి గ్రామాల్లో మౌలిక సదుపా యాల కృషి చేస్తానని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులకు చేన్లకు వెళ్లేందుకు రహదారుల ఏర్పాటుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అంతేకాకుండా విద్య, మహిళా సాధికారతతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సైతం అర్హులైన పేదలకు అందేలా తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అంతే కాకుండా గ్రామంలో అర్హులైన వారికి పింఛన్లతో పాటు గ్రామంలోని ప్రధాన కూడలిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. నిరుద్యోగ యువ తకు నైపుణ్యా భివృద్ధి శిక్షణకు సహకరిస్తాను. గ్రామస్థులందరి సహ కారంతో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన సంకల్పమన్నారు. సర్పంచ్ పదవి కోసం తన ఆరాటం కాదని ఊరు అభి వృద్ధి కోసమే తన పోరాటమన్నారు. ఉంగరం గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# చివరి విడత పంచాయతీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి):

మూడవ(చివరి)విడతలో నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికలు-2025లో భాగంగా కరీంనగర్ జిల్లాలో 17న చివరి విడత పోలింగ్ జరగనుంది. జమ్మికుంట, ఇల్లందకుంట, హుజురాబాద్, వీణవంక, వి.సైదాపూర్ మండలాల్లోని గ్రామపంచాయతీలకు సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. హుజురాబాద్ మండలానికి సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, జమ్మికుంట మండలానికి సంబంధించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ఇల్లందకుంట మండలానికి సంబంధించి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ ఫంక్షన్ హాల్ లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం సందర్శించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ప్రతి కౌంటర్ ను, ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే జోనల్, రూట్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు జిల్లాకేంద్రానికి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. రూట్, జోనల్, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని అన్నారు. చివరి దశ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయాలని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్డిఓ రమేష్ బాబు ఉన్నారు.

# నూతనంగా ఎన్నికైన పలు సర్పంచులను సన్మానించిన శోభారాణి,సత్యనారాయణ గౌడ్.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 16 (భారత శక్తి): నర్సాపూర్ (జి) మండలం రాంపూర్, టెంబర్ని గ్రామాల సర్పంచుల దంపతులను ఘనంగా సన్మానించిన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ వి. శోభారాణి, నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్ దంపతులు. ప్రజలు ఎంతో నమ్మకంతో అప్పగించిన అధికార పీఠాన్ని చేపడుతున్న సర్పంచులు నిజాయితీగా ప్రజలకు సేవలు అందించి మంచి గుర్తింపు పొందాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ వి. శోభారాణి, సత్యనారాయణ గౌడ్ దంపతులు అన్నారు. మంగళవారం రాంపూర్ సర్పంచ్ గా ఎన్నికైన చిన్నోళ్ల విజయలక్ష్మి ప్రవీణ్ దంపతులను, టెంబర్ని గ్రామ సర్పంచ్ గా విజయం సాధించిన నిమ్మల లలిత శ్రీధర్ రెడ్డి దంపతులను, వార్డు సభ్యులను శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని, అభివృద్ధి సంక్షేమ రంగాలను అమలు చేసి ప్రజల మనసులు దోచుకోవాలని సూచించారు. పార్టీలకతీతంగా అభివృద్ధి ధ్యేయంగా సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో పద్మనాభ గౌడ్, ఎం.శంకర్, రమణ గౌడ్ నారాయణ,మాజీ సర్పంచ్ గంగారామ్,రాంపూర్ ఉప సర్పంచ్ ఖమరొద్దిన్ రెండు గ్రామాల వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలు (3వ దశ) సిద్ధం

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 16: గ్రామ పంచాయతీలకు జరుగుతున్న 2వ సాధారణ ఎన్నికల 3వ దశ సందర్భంగా ప్రజా శాంతి, శాంతి భద్రతలు కాపాడేందుకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 క్రింద కామారెడ్డి జిల్లాలో నిషేధాజ్ఞలు విధించబడినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.



నిషేధాజ్ఞల వివరాలు:

అమలు ప్రాంతం: కామారెడ్డి జిల్లా పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రాంతాలు

అమలు కాలం:

15.12.2025 సాయంత్రం 5:00 గంటల నుండి

18.12.2025 ఉదయం 10:00 గంటల వరకు

(లేదా ఓట్ల లెక్కింపు పూర్తై, ఎన్నికల సామగ్రి సురక్షితంగా నిల్వ చేసే వరకు

ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా, న్యాయంగా సాగేందుకు ప్రజా శాంతి భద్రతలను పరిరక్షించడం., జిల్లా పరిధిలోని అన్ని పౌరులు, సంస్థలు నిషేధాజ్ఞలను ఖచ్చితంగా పాటించాలని జిల్లా పోలీసు శాఖ నిషేధాజ్ఞల అమలును పర్యవేక్షించడం జరుగుతుందని, నిషేధాజ్ఞల ఉల్లంఘన పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

# గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలి :: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

ములుగు జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 16 (భారత శక్తి) : మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయ ప్రాంగణ పునరుద్ధరణ అభివృద్ధి పనులను నిర్దేశించిన గడువులోపు పనులన్నీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. అధికారులను ఆదేశించారు. మంగళవారం ములుగు జిల్లా ఎస్.ఎస్. తాడ్వాయి మండలంలోని మేడారం శ్రీ సమ్మక్క



సారలమ్మ దేవాలయ ప్రాంగణం పునరుద్ధరణ అభివృద్ధి పనులను, గోవిందరాజుల గద్దెల రాతి నిర్మాణాలను, రాతి స్తంభాల స్థాపన నిర్మాణ పనులను, రహదారులను, ఫ్లోరింగ్ సుందరీకరణ పనులను, జంపన్న వాగు పరిసర ప్రాంతాలను జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్. క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత అధికారులతో, గుత్తేదారులతో మాట్లాడుతూ డిసెంబర్ 24వ తేదీ లోపు దేవాలయ ప్రాంగణ పనులను పూర్తిచేయాలని ఆదేశించారు.

జాతర సమీపిస్తున్న నేపథ్యంలో ముందస్తు మొక్కులు చెల్లించడానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలిగించకుండా పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. మహా జాతరకు విచ్చేసే కోట్లాదిమంది భక్తులకు దేవాలయ ప్రాంగణం మహా కళాఖండంగా దర్శనమిస్తుందని ప్రతి భక్తుడికి మధురానుభూతిని కలిగించే విధంగా ఆలయ ప్రాంగణం రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులు,తహసిల్దార్,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు పారమిత

కరీంనగర్, డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి):

ఈ నెల 17 నుండి 25 వ తేదీ వరకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆద్వర్యంలో లో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-14 క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీలకు పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్, ప్రధానోపాధ్యాయులు హన్మంత రావు తెలిపారు. ఇటీవల కరీంనగర్ జిల్లా అలుగునూర్ లో జరిగిన అండర్-14 జిల్లాస్థాయి పోటీలలో కేధార్ నాధ్ అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని పాఠశాల చైర్మన్ డాఎం ఇ. ప్రసాదరావు మరియు డైరెక్టర్స్ ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, వి.యు.యం.ప్రసాద్, వినోద్ రావు, కె.హన్మంతరావు, ప్రత్యేకంగా అభినందించారు.



ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపికృష్ణ, సమన్వయ కర్తలు రబీంద్ర పాత్రో, భవానీ, నిఖిత మరియు వ్యాయామ ఉపాధ్యాయుడు జి.మహేష్, యస్. రాజు లు పాల్గొన్నారు.

# తప్పు చేస్తే ఎంతటి వారైనా శిక్ష అనుభవించాల్సిందే : ఎమ్మెల్యే మదన్ మోహన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 16: ఎల్లారెడ్డి మండలం సోమార్పేట్ గ్రామంలో దురదృష్టవశాత్తు జరిగిన ప్రమాద ఘటనలో గాయపడిన బిట్ల భారతి (హైదరాబాద్ యశోద ఆసుపత్రి), బాలమణి (వెల్లన్స్ హాస్పిటల్) చికిత్స పొందున్న వారిని స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు తక్షణ ఆర్థిక సహాయం అందజేసి, వారి కుటుంబాలకు ధైర్యం చెప్పారు.

ఎమ్మెల్యే సంబంధిత ఆసుపత్రులలోని వైద్యులతో మాట్లాడి, గాయపడిన వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులపై సమాచారం తెలుసుకున్నారు. బాధితుల ప్రాణాలను కాపాడేందుకు ఖర్చుకు వెనకాడకుండా అత్యుత్తమ చికిత్స అందించాలనీ, ఎలాంటి లోటుపాట్లు లేకుండా వైద్య సేవలు అందించాలని వైద్యులను ఎమ్మెల్యే కోరారు.

అదేవిధంగా, బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే, ఈ కష్ట సమయంలో తాము పూర్తిగా వారి పక్షాన ఉన్నామని, అవసరమైన అన్ని విధాల సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ,

"ఎల్లారెడ్డి మండలం సోమార్పేట్ గ్రామంలో జరిగిన ఈ ప్రమాద ఘటన అత్యంత దురదృష్టకరం, హృదయ విదారకం. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవు" అని తెలిపారు. ఇప్పటికే జిల్లా ఎస్పీ, డీఎస్పీ లతో మాట్లాడి సంపూర్ణ విచారణ చేపట్టాలని ఆదేశించామని, ఈ సంఘటనకు సంబంధించి ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు కూడా వెల్లడించారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకుని



సాధారణ జీవితం గడపాలని మనస్ఫూర్తిగా భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# లక్ష్మయ్య మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటు: సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి

సూర్యాపేట (భారత శక్తి జిల్లా ప్రతినిధి) డిసెంబర్ 16:

సీనియర్ కమ్యూనిస్టు నాయకులు తుంగతుర్తి మాజీ జెడ్పిటిసి మురగుండ్ల లక్ష్మయ్య మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. మంగళవారం మద్దిరాల మండలం ముకుందాపురం గ్రామానికి



చెందిన సీనియర్ కమ్యూనిస్టు నాయకులు ము రగుండ్ల లక్ష్మయ్య(75) గుండెపోటుతో హైదరాబాదులో మృతి చెందారు. వారి మృతదేహాన్ని ఆయన సొంత గ్రామం ముకుందపురం గ్రామానికి తీసుకువచ్చిన సందర్భంగా ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టిన మురగుండ్ల లక్ష్మయ్య తన జీవితాంతం అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పనిచేశారని అన్నారు. ముకుందాపురం గ్రామానికి ఉప సర్పంచ్ గా, సర్పంచిగా, ఎంపీటీసీగా, నూతనకల్ వైస్ ఎంపీపీగా, తుంగతుర్తి జడ్పిటిసిగా పనిచేశారని అన్నారు. ముకుందాపురం గ్రామంలో భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా రైతులను, వ్యవసాయ కార్మికులను కదిలించి అనేక పోరాటాలు నిర్వహించారని అన్నారు. పేదలకు తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే మల్లు స్వరాజ్యం ద్వారా 270 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. దళితులకు70 ఇల్లను భీమ్ రెడ్డి నరసింహారెడ్డి ద్వారా ఇప్పించారనిఅన్నారు. సిపిఎం పార్టీ తుంగతుర్తి డివిజన్ కార్యదర్శిగా20 ఏండ్ల పాటు పనిచేశారని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో అనేక ఇబ్బందులు వచ్చినప్పుడు సైతం ప్రజల వైపు గెలిచాడని అన్నారు. జేన్నారెడ్డి భూములు కొన్నవారికి పట్టాలు ఇప్పించాలని అనేక పోరాటాలు నిర్వహించారని అన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు కందాల శంకర్ రెడ్డి, పులుసు సత్యం, బుర్ర శ్రీనివాస్, మద్దిరాల, తిరుమలగిరి,నాగారం, మండల కార్యదర్శి పోలోజు సైదులు, గుమ్మడవెల్లి ఉప్పలయ్య, దేవరకొండ యాదగిరి, తుంగతుర్తి మాజీ జడ్పిటిసి తాటి విజయమ్మ, నాయకులు ఓరుగంటి అంతయ్య, అంజపల్లి లక్ష్మయ్య, బొజ్జ శ్రీను, మద్దెల కోటయ్య, శివరాత్రి మల్లయ్య, గాజు గళ్ళ ముత్తయ్య, బండమీది ఎల్లయ్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కోమటిరెడ్డిని కలిసిన నూతనంగా ఎన్నికైన సర్పంచులు

## సుడా నిధులతో అభివృద్ధి పనులు చేపడుదామన్న చైర్మన్ నరేందర్ రెడ్డి

కరీంనగర్, డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి):

నూతనంగా ఎన్నికైన సర్పంచులు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని సుడా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సర్పంచులను నరేందర్ రెడ్డి శాలువాలతో సత్కరించి మిఠాయి తినిపించారు. ఈ సందర్భంగా సర్పంచులు గ్రామాల సమస్యలు అభివృద్ధిపై ఆయనతో చర్చించారు. జిల్లా మంత్రుల



సహకారంతో, సుడా నిధులతో అభివృద్ధి పనులు చేపడుదామని ఏ సమస్య వచ్చినా నేను అందుబాటులో ఉంటానని ఎప్పుడైనా మా వద్దకు రావచ్చని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. సుడా చైర్మన్ ను కలిసిన వారిలో చామనపల్లి సర్పంచ్ బోగొండ ఐలయ్య, దుబ్బపల్లి సర్పంచ్ మోతె ప్రశాంత్ రెడ్డి, ఏలబోతారం సర్పంచ్ తప్పట్ల రాజు, జూబ్లీ నగర్ సర్పంచ్ కమలాకర్, ఫకీర్ పేట్ సర్పంచ్ బొద్దుల విజయలక్ష్మి లక్ష్మీనారాయణ, బహదూరా?న్ పేట్ సర్పంచ్ గుర్రం సంధ్య తిరుపతి రెడ్డి, దుబ్బపల్లి ఉప సర్పంచ్ అల్వాల శ్రీకాంత్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, వేల్పుల రవీందర్ రావు, మీసాల సాయిలు, బుర్ర గంగయ్య, దీకొండ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ముద్దు

## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి - మట్టి పెల్లి సైదులు

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)డిసెంబర్ 16:


మోడీ ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 ను రద్దు చేసి, 2025 పేరుతో 197 బిల్లును తెచ్చారని ఈ బిల్లు చట్టమైతే ఉపాధి హామీ చట్టం తల లేని మొండంగా తయారు అవుతుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టి పల్లి సైదులు మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వికసిత్ భారత్ 2047 లో భాగం



చేస్తూ గ్యారంటీ రోజగార్ మరియు అజీవిక మిషన్ (గ్రామీణ) Vb - G RAM G 2025 బిల్లు తెచ్చారని అన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఎందుకు రద్దు చెయ్యబోతున్నారని..? ఈ చట్టం ఉపయోగం లేదు అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. కొత్త చట్టం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడం మెరుగు పరిచే చర్యలు ఏమిటి అని వారు మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కొత్త బిల్లు ఉన్న ఉపాధిని లేకుండా చేస్తున్నదని, పనిదినాలు 125 రోజులకు పెంచుతున్నట్టు చెప్పి 60 రోజులు పని నిషేధం విధించారని, వ్యవసాయ సీజన్ లో రైతులకు కూలీల కొరత లేకుండా అని రైతుల ముసుగు తగిలించారని విమర్శించారు. ఉపాధి హామీ పనులు ఫిబ్రవరి 20 నుండి జూన్ 20 వరకు 75% కు పైగా జరుగుతాయని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని అంటే వ్యవసాయ పనులు పెద్దగా లేని సమయంలో రైతులకు ఎమ్మెస్పి,పంట పెట్టుబడి నుండి తప్పించు కోవటానికి కదా అన్నారు. ఇప్పటి వరకు 90% ఉపాధి హామీ పనుల నిధులు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం 10% వాటా దళం ఉండేదని ఇప్పుడు 40 % వాటా రాష్ట్రాలు ఇవ్వాలని చెప్పటం కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం ఎత్తివేయాలనె కుట్రలో భాగంగానే రాష్ట్రాలపై భారం వెయ్యటం మని అన్నారు. పనులను 4 రకాలుగా విభజించి కోట్ల రూపాయల పనులను చేర్చారని అంటే యంత్రాలు , కాంట్రాక్టర్లకు ఉపాధి హామీగా మార్చటమే కదా అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన వేతనాల కంటే రాష్ట్రలాల్లో ఎక్కువ వేతనాలు ఉంటే అవే కనీస వేతనాలుగా ఉండాలని ఇప్పుడు ఉన్న దానిని కొత్త బిల్లులో రద్దు చేశారని, ద్రవ్యోల్బణం ఆధారంగా వేతనాలు పెరగాలని ఉన్న నిబంధన ఇప్పుడు తొలిగించారని అన్నారు. ఆధార్ నిబంధన కచ్చితంగా అమలు చేయడం లేదని సుప్రీం కోర్టుకు స్పష్టం చేసి ఇప్పటికే ఉపాధికి ఆధార్ లింక్ , కొలతలతో వేతనాలు ఇస్తూ రెండు పూటల హాజరు , కేవైసీ చట్ట విరుద్ధంగా పెట్టారని ఆందోళనకు చేస్తుంటే ఇప్పుడు బయమెట్రిక్, ఏ ఐ, జీపీఎస్ ను చట్ట బద్ధం చెయ్యటం కంటే పేదలను ఉపాధి హామీ నుండి తొలగించడం తప్ప మరొకటి కాదని విమర్శించారు. ఇప్పటి వరకూ పంచాయతీలు ప్రధాన పాత్ర ఉన్నదని ఇప్పుడు అన్ని అధికారాలు కేంద్రంకు ఉంటాయని, చివరకు సోషల్ ఆడిట్ కూడా మనుషులు కాకుండా టెక్నాలజీ తో చేస్తామని ప్రభుత్వం చెబుతుందని దీని వలన ఉపయోగం ఎవరికి ఉంటుందని అడిగారు. ఉపాధి హామీ నిధులతో ఎస్సీ ,ఎస్టీ, ఇతర వెనుకబడిన తరగతులకు ప్రభుత్వం ఇస్తున్న భూముల అభివృద్ధి, కాలనీల అభివృద్ధి, డబల్ బెడ్ రూమ్ ఇళ్లు, నివాస ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ఉపాధి నిధులు మంజూరు చేస్తూ పనులు చేపట్టడం జరిగిందని ఇప్పుడు వాటి ప్రస్తావనే లేకుండా పోయిందని

ఇలాంటి అనేక అంశాలు ఉపాధి హామీ చట్టానికి వ్యతిరేకంగా అనేకం ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం మౌలిక స్ఫూర్తికి పూర్తిగా నిర్వీర్యం , రద్దు ఇప్పుడున్న ఉపాధి చట్టం ఉందని అన్నారు. జీవితవవసరాలు అజీవికగా మార్చటం అంటే ఉపాధి హామీ లక్ష్యంపై దాడి చేయడం తప్ప మరేమీ కాదని అన్నారు. గ్రామాల్లో పడిపోతున్న ఉపాధి పని దినాల వలన పేదలు బ్రతక లేరని ప్రభుత్వ భాద్యతగా భావించి 100 రోజు ఉపాధి చట్టంగా వచ్చిందని. ఇప్పుడు మిషన్ గా మార్చటం వల్ల ఉపాధి అవకాశాలు మరింత కుదించటం కోసం ప్రభుత్వం కొత్త బిల్లు తీసుకొచ్చింది అని అన్నారు. ఈ కొత్త బిల్లు ఉపాధిని హరించేదిగా కొద్ది మేరకు ఉన్న ఉపాధి అవకాశాలు కూడా లేకుండా పోతవని అందుకే మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టటమే ఉండాలని , 2025 బిల్లు వద్దే వద్దని ఈ బిల్లుకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ కార్మికులు, వ్యవసాయ కూలీలు, పేదలు ఆందోళను చేపట్టాలని, బిల్లు కాగితాలను దగ్ధం చేయాలని సైదులు పిలుపునిచ్చారు.


# అల్ఫోర్స్ లో ఘనంగా విజయ్ దివస్ వేడుకలు అమర జవాన్లకు నరేందర్ రెడ్డి ఘనానివాళి



కరీంనగర్, డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి):సైనికుల వల్లనే మన భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నదని, దేశ ప్రజలకు ఎల్లప్పుడూ రక్షణ కల్పించేది వారేనని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి గుర్తుచేశారు. మంగళవారం కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ- టెక్నో పాఠశాలలో విజయ్ దివస్ వేడుకలకు హాజరయ్యారు. ముందుగా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమర జవాన్ల చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వారి త్యాగాలను స్మరించుకుని నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయ్ దివస్ అనగానే అందరికీ స్ఫూర్తి వస్తుందని మరియు సైనికుల యొక్క త్యాగాలు స్ఫూర్తి నింపుతుందని, తెలుపుతూ పాకిస్తాన్ చెరలో బందిగా ఉన్నటువంటి బంగ్లాదేశ్ కు విముక్తి పొందినటువంటి రోజు అని, సైనికులందరికీ పౌరులందరికీ గొప్ప రోజని వారు చెప్పారు. 1970లో కరడు కట్టిన పాకిస్తాన్ పై భారత్ సాధించిన అపూర్వ విషయం ఒకటి గుర్తు వస్తుందని ఆ విజయంతో బంగ్లాదేశ్ ఆవిర్భవించిందని, భారత అమర జవాన్ త్యాగాలు పునాదులపై బంగ్లాదేశ్ పుట్టిందని విజయ్ దివస్ భారత చరిత్రలో సువర్ణఅక్షరాలతో లిఖించబడినదని, భీకరంగా జరిగినటువంటి యుద్ధంలో పాక్ సైన్యం భారత్ ముందు యుద్ధం చేయలేక చేతులెత్తేసిందని చెప్పారు. ఈ సంవత్సరం 54 విజయ్ దివస్ గా జరుపుకుంటున్నామని మరియు ప్రతి ఒక్కరు వీర సైనికులను స్ఫూర్తిగా తీసుకోవాలని దేశానికి రక్షణ కవచంగా ఉండాలని వారు కోరారు. తూర్పు పాకిస్తాన్ ప్రజలు వారిని విముక్తి చేయాలని అనేకమార్లు విన్నవించారని, వేడుకున్నారని చెప్పారు వారి యొక్క దయనీయ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని భారత్ పాకిస్తాన్ సైన్యంతో పోరాడి బంగ్లాదేశ్ ను విముక్తి చేసింది అని చెప్పారు. జై జవాన్ - జై జై జవాన్ %ఁ% జయహో భారత్ - జయహో జవాన్ నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకుపోలీసులకుచిక్కిన మావోయిస్టు దామోదర్

ములుగు జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 16 (భారత శక్తి): మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కా రావు అలియాస్ దామోదర్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు ఆదిలాబాద్ నుంచి సేఫ్ జోన్ వైపు వెళ్తుండగా సిర్పూర్ (యు) పరిధిలో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దామోదర్‌తో పాటు మొత్తం 15 మంది మావోయిస్టులను పోలీసులు పట్టుకున్నారని తెలుస్తోంది. వీరిలో 9 మంది మహిళలు, 7 మంది పురుషులు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. పట్టుబడ్డ మావోయిస్టులను తదుపరి విచారణ నిమిత్తం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయానికి తరలించినట్లు సమాచారం.



## రాయచోటి సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ విజిట్:"

కడప, డిసెంబర్ 16(భారత శక్తి):ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశానుసారంగా, డాక్టర్ సి.యామిని, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ రాయచోటి సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ ను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, అనంతరం జైలు పరిసరాలను, రిజిస్టర్ లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్




నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమములో రాయచోటి సబ్ జైలు సూపరిడెంట్, ప్యానల్ న్యాయవాది మరియు ఖైదీలు పాల్గొన్నారు.

## 5జి మొబైల్ ఫోన్లతో సమర్థవంతంగా అంగన్వాడీ సేవలు: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, డిసెంబర్ 16(భారత శక్తి) : మహిళా శిశు సంక్షేమ శాఖలో సమర్థవంతంగా సేవలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 5ఉ మొబైల్ ఫోన్లు ఎంతో ఉపయుక్తం అవుతాయని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. జమంగళవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి రాష్ట్ర ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖ అంగన్వాడీ లకు సరఫరా చేసిన "శాంసంగ్ 5జి" మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల కలెక్టర్ మాట్లాడుతూ విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీలకు అందచేసిన రాష్ట్ర ప్రభుత్వం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అంగన్వాడీలకు 5ఉ శ్యాంసంగ్ మొబైల్ లను ఈ నెల 11వ తేదీన రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గారు లాంఛనంగా ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రాజెక్ట్ ల వారిగా అంగన్వాడీ వర్కర్లకు, బ్లాక్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ లకు, సూపర్వైజర్ లకు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. డిపార్ట్మెంట్ ఉపయోగిస్తున్న అప్లికేషన్స్, పోషణ ట్రాకర్, బాలసంజీవని లో సమాచారం అప్లోడ్ వంటి సేవలను నిర్వహించేందుకు ఈ మొబైల్ సేవలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. వైఎస్ఆర్ కడప జిల్లాకు సంబందించి 2494 మందికి



5జి మొబైల్స్ ను మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ఈ మొబైల్ ఫోన్ల ద్వారా ఆ శాఖకు సంబందించిన సేవలను మరింత సమర్థవంతంగా, సులభతరంగా నిర్వర్తించాలని అంగన్వాడీ సిబ్బందికి జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడి పి.రమాదేవి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణ ఎస్ హెచ్ జీ కుటుంబాలలోని నిరుద్యోగ యువత కొరకు జాబ్ -మేళాల నిర్వహణ: జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి.



వై ఎస్ ఆర్ కడప,డిసెంబర్ 16(భారత శక్తి):నిరుద్యోగ యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని జిల్లా పాలనాధికారి ఛాంబర్ నందు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) వారి ఆధ్వర్యంలో ఈ నెల 20 న కడప గాంధీ నగర్ మున్సిపల్ హైస్కూల్ నందు నిర్వహించనున్న పట్టణ ఎస్ హెచ్ జీ కుటుంబాల లోని నిరుద్యోగ యువత కొరకు జాబ్ -మేళాల నిర్వహణ నకు సంబంధించి న గోడ పత్రికలను జిల్లా కలెక్టర్,జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ లతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్దేశించిన ఒక కుటుంబం ఒక వ్యాపారవేత్త లక్ష్యానికి అనుగుణంగా మెప్మా సంస్థ ఎస్ హెచ్ జీ సభ్యులు మరియు కుటుంబ సభ్యులకు వారికున్న ఆసక్తి అనుభవం నైపుణ్యం ఆధారంగా ఋణ ఆధారిత స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేయబడుతుందని తెలిపారు. దీని కొరకు జాబ్- మేళాల నిర్వహణ లో విశిష్ట అనుభవం ఉన్న "నిపుణ- హ్యూమన్ డెవలప్మెంట్ సొసైటీ" తో మెప్మా సంస్థ ఒప్పందం కుదుర్చుకుని జాబ్ మేళాలను నిర్వహించి ఉద్యోగ అవకాశాలను సంఘ సభ్యుల కుటుంబాల లోని నిరుద్యోగ యువతీ యువకులకు కల్పించ బడుతుందని తెలిపారు. ఈ జాబ్-మేళాలో పేరొందినటువంటి "ఫ్యూచర్ %×u% సొల్యుషన్స్,ఇన్నోవ్ సోర్స్ సర్వీసెస్,హెటిరో లబ్స్, ఏర్ డీల్ కాపిటల్, మెడ్ ప్లస్ హెల్త్ సర్వీసెస్, ఫ్యూచర్ ప్రాపర్టీ గ్రూప్, భారత్ ఫైనాన్షియల్ ఇంక్లుషన్,తల్న్ వర్క్ టెక్నాలజీస్,ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్,ఆక్సీన్ ఎన్ఐఐటి,మనిపాల్,జస్ట్ డైల్,పేటియం,హెచ్ఎడిబి ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎంఆర్ఎఫ్,ప్రీమియర్ హెల్త్ కేర్,భారత్ బ్యాంక్ హౌసింగ్ ఫైనాన్స్" మొదలగు కంపెనీ లు పాల్గొని వారి కంపెనీ లలో ఎస్ హెచ్ జీ కుటుంబాలలోని నిరుద్యోగ యువతీయువకులకు వారి అర్హతలను బట్టి ఉద్యోగాలు కల్పించబడతాయనన్నారు. ఈ నెల 20వ తేదీన కడప మునిసిపల్ కార్పొరేషన్ పరిధి లోని గాంధీనగర్ మునిసిపల్ హైస్కూల్ నందు ఉ.10గంటలకు జాబ్ మేళా ప్రారంభించ బడుతుందని తెలిపారు. మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూజాబ్ -మేళా లో పాల్గొనదలచిన ఎస్ హెచ్ జీ కుటుంబాలలోని నిరుద్యోగ యువతీ యువకులు వారి వివరాలను మెప్మా వెబ్-సైట్ లో ప్రత్యేకంగా డిజైన్ చేసిన వెబ్-పేజి వివరాలను నింపి ఆన్లైన్లో నమోదు చేసుకోవడం జరిగిందనన్నారు.

అర్హతలు:

18 నుండి 35 సంవత్సరముల వయసు

పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, బిటెక్, యంటెక్, డిగ్రీ మరియు పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు

పట్టణ ప్రాంతాలలోని స్వయం సహాయక సంఘ సభ్యులు, కుటుంబ సభ్యులు మాత్రమే అర్హులు.

వై.యస్.ఆర్.కడప జిల్లా 08 మునిసిపాలిటీల పరిధిలోని స్వయం సహాయక సంఘలలో పై అర్హత కలిగిన సంఘ సభ్యులు, కుటుంబ సభ్యుల నిరుద్యోగులు ఈ జాబ్ మేళా కొరకు రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగింది. ఎవరైనా ముందుగా రిజిస్టర్ చేసుకోవచ్చు లేదా డైరెక్ట్ గా జాబ్ మేళా నిర్వహించే రోజు కూడా రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా మొత్తం 15 కంపెనీలు ప్రత్యక్షంగా జాబ్-మేళాలో పాల్గొని అర్హులైన అభ్యర్ధులను ఎంపిక చేసుకుంటాయని తెలిపారు.

## చివరి పంచాయతీ ఎన్నికలకు పటిష్ట భద్రత :సీపీ గౌష్ ఆలం

కరీంనగర్, డిసెంబర్ 16(భారతశక్తి ప్రతినిధి):

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డిసెంబర్ 17న జరగనున్న మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందితో సమీక్షా సమావేశం అనంతరం, ఎన్నికల బందోబస్తు ప్రణాళిక వివరాలను వెల్లడించారు.

ఎన్నికల వివరాలు

పోలింగ్ కేంద్రం నిబంధనలు

పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల వరకు ప్రచారం, పార్టీ చిహ్నాలు, గుంపుల గుమికూడింపులు పూర్తిగా నిషేధం. పోలింగ్ స్టేషన్లో మొబైల్ ఫోన్లు, ప్రచార సామగ్రి అనుమతించబడవని పేర్కొన్నారు.

పోలీస్ సిబ్బంది కేటాయింపు

మూడవదశ ఎన్నికల బందోబస్తు కోసం దాదాపు 877 మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నట్లు సీపీ తెలిపారు.



మూడవదశ మండలాలు కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని వీణవంక , ఇల్లందకుంట, జమ్మికుంట, హుజురాబాద్, వి. సైదాపూర్ ఐదు మండలాల పరిధి.

గ్రామ పంచాయతీలు 111,

మొత్తం పోలింగ్ కేంద్రాలు 1034.

భద్రతాంశాలు

ప్రతీ మండలానికి ఒక ఏసీపీ అధికారిని కేటాయించామని, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, ఎక్కువ పోలింగ్ కేంద్రాలు గల మండలాలలో ఇద్దరు ఏసీపీ లను సైతం కేటాయించామని తెలిపారు.

లిసమస్యాత్మక కేంద్రాలు

గత సంఘటనల ఆధారంగా గుర్తించిన సున్నితమైన పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించడంతో పాటు, వెబ్ కాస్టింగ్ లేదా మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేస్తున్నారు.

బలగాల మోహరింపు

ప్రతి పోలింగ్ స్టేషన్లో స్టాటిక్ పోలీసు పార్టీ, ప్రతి మార్గంలో రూట్ మొబైల్ పార్టీ ఉండేలా ప్రణాళిక రూపొందించారు.

స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్లి ఎన్నికలు జరిగే ప్రతి మండలానికి ఒక ఏసీపీ స్థాయి అధికారిని ఇన్చార్జిగా నియమించి, వారి అధీనంలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ను కేటాయించారు. ఈ ఫోర్స్లో స్పెషల్ యాక్షన్ టీమ్ పోలీసులు పూర్తి స్థాయి రైట్ గేర్తో సిద్ధంగా ఉంటారు.

ఇందులో 06 ఏసీపీలు, 20 ఇన్స్పెక్టర్లు, 39 ఎస్సైలు, 40 ఏఎస్సై/ హెడ్ కానిస్టేబుల్స్, 460 కానిస్టేబుళ్ళు, 35 స్పెషల్ యాక్షన్ టీమ్ పోలీసులు, 178హోంగార్డ్స్ తో 100 మంది బెటాలియన్ స్పెషల్ పోలీసులతో పాటుగా అదనంగా ఈ విడతలో ఎన్.సీ.సీ. సభ్యులను వినియోగిస్తున్నట్లు సీపీ తెలిపారు.

కమ్యూనికేషన్, నిఘా

సమాచారం వేగంగా చేరవేసేందుకు 5 మండలాల్లో అదనంగా రిపీటర్, బేస్ సెట్లను ఏర్పాటు చేసి, వైర్ లెస్ కమ్యూనికేషన్ను పూర్తి సంసిద్ధంగా ఉంచారు. పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్స్లను రిసీవింగ్ సెంటర్లకు తరలించే ప్రక్రియ కట్టుదిట్టమైన భద్రతల మధ్య, పోలీసుల నిరంతర నిఘాలో జరుగుతుందని వివరించారు.

నిషేధాజ్ఞలు

శాంతిభద్రతల పరిరక్షణ కోసం భారతీయ నాగరిక్ సురక్ష సంహిత లోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలను విధిస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

విజయోత్సవ ర్యాలీలపై నిషేధం

ఎన్నికల అనంతరం అదేరోజు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం పూర్తిగా నిషేధం అని సీపీ స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసు అధికారులకు పూర్తిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## సర్పంచి నిధులు లేక నీటిని వృధా చేస్తున్నారేమో!

పోరుమామిళ్ళ, భారతశక్తి ప్రతినిధి, డిసెంబర్ 16: పోరుమామిళ్ల మండలం అక్కల రెడ్డిపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలోని మంచినీటి బోరు నుండి గత కొద్ది నెలలుగా నీరు వృధాగా పోతున్న ప్రజా ప్రతినిధులు అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రభుత్వలు నీరు వృధా కాకుండా ఎన్నో కార్యక్రమాలను చేస్తున్నప్పటికీ పంచాయతీకి సంబంధించిన నాయకులు అధికారులు సరిగా లేకపోవడం వల్లనే ఇలాంటి సంఘటనలు జరుగుతాయని ప్రజలు వాపోతున్నారు. ఎన్నోమార్లు సర్పంచ్ కి అధికారులకు ఈ మధ్యకాలంలో మండల అధికారులకు తెలియజేసిన ఒరిగిందేమీ లేదు. మరి ఎందుకు ఈ సమస్యను పట్టినట్టు ఉన్నారో తెలియడం లేదని ఎస్సీ కాలనీ ప్రజలు చెప్పుకొచ్చారు. ఇప్పటికైనా రాబోయే కాలం వేసవికాలం కాబట్టి నీటిని వృధాగా పోనివ్వకుండా గాలి పైపు ద్వారా వేస్ట్ గా పోయే



నీటిని కూడా ఖాళీగా ఉన్న బావిలోకి పంపే విధంగా చర్యలు తీసుకొని అందరికీ నీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజా ప్రతినిధులను అధికారులను అక్కలరెడ్డిపల్లె ఎస్సీ కాలనీ ప్రజలు కోరుకుంటున్నారు.

## మూడవ విడత ఎన్నికలకు సర్వం సిద్ధం

**-పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి**

**-పోలింగ్ శాతం రిపోర్ట్ సమయానుసారంగా ఎప్పటికప్పుడు అందించాలి**

**-జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సాంగ్వాన్**

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 16: 2వ సాధారణ గ్రామ పంచాయితీ ఎన్నికలలో భాగంగా రేపు బుధవారం 17వ తేదీన నిర్వహించే మూడవ విడత ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలకు సిబ్బందితో పాటు ఎన్నికల సామాగ్రి బస్సుల ద్వారా తరలించడం జరిగిందనీ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు.

ఈ సందర్భంగా ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. విధులు నిర్వహించే అధికారులు పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని , ఏమైన సమస్యలు ఎదురైతే తక్షణమే ఉన్నతాధికారులకు తెలియజేయాలని అన్నారు.

బాన్సువాడ నియోజకవర్గం లోని బాన్సువాడ మండలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, బిచ్కుంద మండలం, జుక్కల్ మండలాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు, సిబ్బంది తమకు ఇచ్చిన పోలింగ్ సామాగ్రిని చెక్ లిస్ట్ లో చూసుకోవాలని, ఆయా గ్రామ పంచాయతీ లలోని పోలింగ్ స్టేషన్లకు చేరుకున్న తర్వాత పోలింగ్ నిర్వహణకు అవసరమైన ప్రతి ఒక్క వస్తువును తమ వద్ద ఉంచుకోవాలన్నారు. రిజర్వ్ కౌంటర్లో ఎంతమంది అధికారులు రిపోర్టు చేసారో పరిశీలించి, అవసరమైన గ్రామ పంచాయితీలలో వారు విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. స్పెషల్ కౌంటర్లో బ్యాలెట్ పేపర్స్ తో పాటు పోలింగ్ కు అవసరమైన వివిధ ఫారాలను, కవర్లను, ఇతర సామాగ్రిని సరిచూసుకోవాలి, పోలింగ్ విధులు నిర్వర్తించే అధికారులు డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో రిపోర్టింగ్ చేశాక రూట్ వారీగా సంబంధిత గ్రామ పంచాయతీలకు పోలింగ్ మెటీరియల్ తో వెళ్లేందుకు జోనల్ అధికారులు సహకరిస్తారన్నారు.



ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకొని బుధవారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ విధులు నిర్వహించే అధికారులు తమకు కేటాయించిన గ్రామ పంచాయతీలకు వాహనాల్లో తరలి వెళ్లే సమయం నుంచి కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేసి తిరిగి రిసెప్షన్ కేంద్రానికి వచ్చేవరకు అవసరమైన పోలీస్ బందోబస్తు నియమించినట్లు తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, సీఈఓ చందర్ ఎన్నికల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ‘ఓజీ’ దర్శకుడికి పవన్ కల్యాణ్ అదిరే గిఫ్ట్



‘ఓజీ’ దర్శకుడు సుజీత్ కు పవన్ కల్యాణ్ అదిరిపోయే బహుమతి ఇచ్చారు. ల్యాండ్ రోవర్ డిఫెండర్ కారును కానుకగా అందజేశారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంటూ సుజీత్ ఆనందం వ్యక్తంచేశారు. “బాల్యం నుంచి పవన్ అభిమానిని అయిన నేను ఇప్పుడు ఆయన్నుంచి గిఫ్ట్ అందుకున్నా. నాకు మాటల్లో చెప్పలేనంత సంతోషంగా ఉంది. నా ఓజీ పవన్ కల్యాణ్ ప్రేమ, ప్రోత్సాహం మరువలేనివి. ఎప్పటికీ ఆయనకు రుణపడి ఉంటా” అని పేర్కొన్నారు. ఈ కారు ధర రూ.కోటికి పైగానే ఉంటుందని తెలుస్తోంది. పవన్‌తో దిగిన ఫొటోలను సుజీత్ పంచుకున్నారు. ప్రస్తుతం ఇవి నెట్టింట వైరల్‌గా మారాయి. ముఖ్యంగా పవన్ కొత్త లుక్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కొత్త సినిమా కోసమే పవన్ హెయిర్‌స్టైల్ మార్చారని సమాచారం. ‘ఓజీ’తో పవన్- సుజీత్ క్రేజీ కాంబినేషన్ అనిపించుకున్న సంగతి తెలిసిందే. కొంతకాలంగా అభిమానులు తెరపై పవన్‌ను ఎలా చూడాలనుకున్నారో అదేస్థాయిలో చూపించి మెప్పించారు సుజీత్. సెప్టెంబరులో థియేటర్లలో సందడి చేసిన ఈ సినిమా ప్రస్తుతం ఓటీటీ ‘నెట్‌ఫ్లిక్స్’లో స్ట్రీమింగ్ అవుతోంది. ‘ఓజీ’ ప్రీక్వెల్, సీక్వెల్ తెరకెక్కించే ఆలోచన ఉన్నట్లు సుజీత్ ఓ సందర్భంలో తెలిపారు. ‘ఓజీ’ విడుదలకు ముందే నాని హీరోగా ఓ సినిమాని ప్రకటించిన సుజీత్.. ప్రస్తుతం ఆ మూవీ పనులతో బిజీగా ఉన్నారు. ‘ఉస్తాద్ భగత్‌సింగ్’తో మరోసారి ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతున్నారు పవన్ కల్యాణ్. మరో మూవీ కోసమే ఆయన లుక్ మార్చినట్లు తెలిసింది.

## సినిమా

# ఓటీటీలోకి రాజు వెడ్స్ రాంబాయి



చిన్న చిత్రంగా విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని నమోదు చేసింది రాజు వెడ్స్ రాంబాయి. అఖిల్, తేజస్విరావ్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని సాయిలు కంపాటి తెరకెక్కించాడు. రాహుల్ మోపిదేవితో కలిసి దర్శకుడు వేణు ఊడుగుల నిర్మించాడు. చైతు జొన్నలగడ్డ, అనిత చౌదరి తదితరులు ఇందులో కీలక పాత్రలు పోషించారు. గత నెల 21న థియేటర్లలో సందడి చేసిన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. ఈ నెల 18 నుంచి తెలుగు ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ మూవీ ఎగ్జైటెడ్ కట్‌ను ఓటీటీలో రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించింది. థియేటర్లో ఈ మూవీ రన్‌టైమ్ 2 గంటల 15 నిమిషాలు కాగా, ఎక్స్టెటెడ్ కట్‌లో మరికొన్ని సన్నివేశాలను జోడించి విడుదల చేయనున్నారు. సినిమా కథ విషయానికొస్తే.. వరంగల్, ఖమ్మం మధ్య ఉన్న ఓ పల్లెటూరులో బ్యాండ్‌కొట్టేవాడి రాజు పాత్రలో హీరో నటిస్తాడు. రాంబాయి అతని నిజాయితీని చూసి ప్రేమను అంగీకరించినప్పటికీ ఆమె తండ్రికి కూతురిని ఒక ప్రభుత్వ ఉద్యోగికి ఇవ్వాలన్న కోరిక ఉంటుంది. ఈ క్రమంలో రాంబాయి తండ్రి వెంకన్నను ఒప్పించేందుకు రాజు ఎంచుకున్న మార్గం ఏమిటి? ఆ తర్వాత ఏమి జరిగిందనేదే కథ.

# పెళ్లి చేసుకోలేదు



నాని ‘కృష్ణగాడి వీర ప్రేమ గాధ’ సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన బ్యూటీ మెహ్రీన్ పీర్జాదా.. మహానుభావుడు, రాజా ది గ్రేట్, ఎఫ్ 2, ఎఫ్3 మూవీలతో హిట్స్ అందుకుంది. ఇదిలా ఉంటే కెరీర్ పీక్‌లో ఉండగానే.. 2021లో అడంపూర్ ఎమ్మెల్యే కుల్దీప్ బిష్ణోయ్ కుమారుడు, హర్యానా మాజీ ముఖ్యమంత్రి భజన్ లాల్ మనవడు భవ్య బిష్ణోయ్‌తో మెహ్రీన్ ఎంగేజ్‌మెంట్ జరిగింది. అయితే కొన్ని నెలలకే ఇద్దరూ పెండ్లి క్యాన్సిల్ చేసుకున్నారు. ఆతర్వాత సోషల్ మీడియాతో బిజీగా గడిపిన ఈ అమ్మడు.. 2023లో చిరంజీవ్ మక్వానాను సీక్రెట్ గా మ్యారేజ్ చేసుకుందని నెట్టింట పుకార్లు పుట్టుకొచ్చాయి. అయితే ఇలాంటి వార్తలపై తాజాగా మెహ్రీన్‌ఘాటుగానే స్పందించింది. తన పెండ్లంటూ ఆర్టికల్ రాసిన ఓ మీడియా సంస్థపై అసహనం వ్యక్తం చేసింది. ‘రెండేండ్లుగా ఇలాంటి వ్యవహారాలపై మౌనంగా ఉన్నా, ఇప్పుడు మాట్లాడక తప్పడం లేదు. ‘ఓ వ్యక్తిని నేను పెళ్లి చేసుకున్నట్లు వార్త రాశారు. అతడితో నాకు పరిచయం కూడా లేదు. నేను ఎవరినీ వివాహం చేసుకోలేదు. మ్యారేజ్ చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు మీకందరికీ చెబుతా. నన్ను నమ్మండి. వదంతులు వ్యాప్తి చేయొద్దు’ అని రిక్వెస్ట్ చేసింది.

# ‘డబుల్’ ట్రీట్



మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ సతీమణి, అపోలో హాస్పిటల్స్ డైరెక్టర్ ఉపాసన కొణిదెల ఇటీవలి కాలంలో తరచుగా వార్తల్లో నిలుస్తోంది. తాజాగా ఆమె ‘మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్’ అవార్డ్‌ను సొంతం చేసుకుంది. ఈ శుభవార్తను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంది ఉపాసన. అయితే ప్రస్తుతం తాను ప్రెగ్నెన్సీతో ఉన్నందువల్ల పురస్కారాన్ని తీసుకునేందుకు వెళ్లలేకపోయానని తెలిపింది. ఈ గుర్తింపు మరింత ఎక్కువగా పనిచేయడానికి, తమ పరిమితులను అధిగమించడానికి ప్రేరణనిస్తుందని పేర్కొంది. ఈ ప్రతిష్టాత్మక అవార్డ్‌తో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇది చూసిన మెగా అభిమానులు ఉపాసనకు కంగ్రాట్స్ చెబుతున్నారు. దీనికి తోడు రామ్‌చరణ్, ఉపాసన దంపతుల ఇంట త్వరలో మరోసారి శుభవార్త వినిపించనుంది. 2012లో వివాహం చేసుకున్న ఈ జంట, 2023 జూన్‌లో క్లీంకారకు జన్మనిచ్చారు. తాజాగా, ఉపాసన రెండోసారి గర్భం దాల్చింది. దీపావళి సంబరాల్లో భాగంగా ఆమెకు సీమంతం నిర్వహించిన దృశ్యాలు, అలాగే ‘డబుల్’ అనే పదాన్ని పదే పదే ఉపయోగించడంతో మెగా అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. రామ్ చరణ్ ప్రస్తుతం పెద్ది మూవీలో నటిస్తున్నాడు. బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా.. బుచ్చిబాబు దర్శకత్వంలో ఈ స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ మూవీని తెరకెక్కిస్తున్నాడు.



## ఇలాంటి వారితో జాగ్రత్తగా ఉండండి

**: రకుల్‌ప్రీత్ సింగ్**

తన శరీర మార్పులకు కారణం పాస్టిక్ సర్జరీ అని పేర్కొంటూ ఓ వ్యక్తి పెట్టిన పోస్టుపై నటి రకుల్‌ప్రీత్ సింగ్ స్పందించారు. అతడి వ్యాఖ్యలను ఖండించారు. వైద్యులమని చెప్పుకొనే ఇలాంటివారితో జాగ్రత్తగా ఉండాలంటూ అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ‘‘వాస్తవాలు తెలుసుకోకుండా కొందరు ప్రజలను తప్పు దారి పట్టిస్తున్నారు. ఇది భయానకం. నేను సంప్రదాయ వైద్యంతో పాటు ఆధునిక చికిత్సలనూ నమ్ముతా. ఒకవేళ ఎవరైనా ఇలాంటి సర్జరీలు చేయించుకున్నా నేను తప్పు పట్టను. కానీ, కష్టపడి వ్యాయామం చేసినా బరువు తగ్గొచ్చనే విషయాన్నీ దృష్టిలో పెట్టుకోవాలి’’ అని పేర్కొన్నారు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు రకుల్ ముఖం పూర్తిగా మారిపోయిందని, అందుకు కారణం ప్లాస్టిక్ సర్జరీ అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరు వీడియో పోస్టు చేశారు. ఆమె ఎన్ని వ్యాయామాలు చేసినా ఫలితం లేకపోవడంతో చివరకు సర్జరీ చేయించుకున్నారని అందులో పేర్కొన్నారు. నోరా ఫతేహి, జాక్వెలిన్ ఊర్వశీ రౌతేలా, అనన్యాపాండే తదితర హీరోయిన్లు సర్జరీలు చేయించుకున్నట్లు పేర్కొన్న వీడియోలు ఆ ఖాతాలో ఉండడం గమనార్హం.

## రణ్‌వీర్ సింగ్ ఇమిటేషన్ ఇబ్బందిపెట్టింది


**: రిషబ్‌శెట్టి**



‘కాంతార’ లోని ఓ సీన్‌ను బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ ఇమిటేట్ చేయడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. దానిపై ఆ సినిమా దర్శకుడు, నటుడు రిషబ్‌శెట్టి తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. ‘‘రణ్‌వీర్ అలా చేయడం నాకు ఇబ్బందిగా అనిపించింది. దైవిక అంశాలతో రూపొందిన సినిమా అది. దానితో మాకు (కన్నడ ప్రజలు) ఎమోషనల్ కనెక్షన్ ఉంది. అందుకే నేను ఎక్కడికెళ్లినా.. ఈ సినిమాలోని సన్నివేశాలను వేదికలపై హాస్యాస్పదంగా ఇమిటేట్ చేయొద్దని చెబుతుంటా’’ అని అన్నారు. కొన్నిరోజుల క్రితం గోవాలో జరిగిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి) వేడుకల్లో.. కాంతారలోని ఓ సీన్‌ను కామెడీగా అనుకరించారు రణ్‌వీర్. అలా చేయడంపై కన్నడిగులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తర్వాత దీనిపై స్పందించిన రణ్‌వీర్ సారీ చెప్పారు. ‘‘రిషబ్ చాలా బాగా చేశారని చెప్పడం కోసం నేను అలా నటించాను. ఆ సన్నివేశాల్లో నటించడం ఎంత కష్టమో నాకు తెలుసు. ఎంతో కష్టమైన సన్నివేశాల్లోనూ అద్భుతంగా చేయగలరు కాబట్టే ఆయనంటే నాకు చాలా ఇష్టం. మన దేశంలోని అన్ని సంప్రదాయాల మీద నాకు గౌరవం ఉంది. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధ పెట్టి ఉంటే క్షమించండి’’ అంటూ పోస్టు పెట్టారు.

## ‘అఖండ 2’కు సమస్య.. ఆ సెంటిమెంట్ నమ్మారా?

**బోయపాటి ఏమన్నారంటే**




హైదరాబాద్: బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను తెరకెక్కించిన ‘అఖండ 2’ థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో దర్శకుడు పాల్గొన్నారు. ఇంతకుముందు ఈ సినిమా వాయిదా పడిన విషయాన్ని విలేకరులు ప్రస్తావించగా.. ఆయన స్పందించారు. ‘తెలుగులో శివుడి నేపథ్యంతో రూపొందిన పలు సినిమాలు విడుదలకు ముందు సమస్యలు ఎదుర్కొన్నాయి. ‘అఖండ 2’కూ అదే జరిగింది. ఈ సెంటిమెంట్ మీరు నమ్ముతారా?’ అని ప్రశ్నించగా.. అలాంటిదేం లేదన్నారు. ఇది శివుడి సినిమా కాదని, శివ భక్తుడి కథాంశంతో తెరకెక్కిన చిత్రమని పేర్కొన్నారు.

# జిహెచ్ఎంసి డివిజన్ల విభజన అశాస్త్రీయం

* ఎన్ని కుట్రలు చేసినా మేయర్ పీఠం బిజెపిదే
* బీజేపీ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిగా అవకాశమిస్తే నేను పోటీకి సిద్ధం : బిబిఆర్ వేణు




ఎల్బీనగర్,డిసెంబర్ 16 (భారత శక్తి): రానున్న గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలలో బిజెపిని ఓడించేందుకు అశాస్త్రీయ పద్ధతిలో కాంగ్రెస్ ప్రభుత్వం డివిజన్ల విభజన చేసినప్పటికీ మేయర్ పీఠం బిజెపికి దక్కుతుందని బిజెపి ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి, మీడియా ఇన్చార్జి బిబిఆర్ వేణు పేర్కొన్నారు. మంగళవారం ఆర్కే పురం డివిజన్ లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గత జిహెచ్ఎంసి ఎన్నికలలో 48 మంది బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థులు ఘన విజయం సాధించారని అయితే ఈ ఎన్నికలలో పూర్తిస్థాయి మెజారిటీని బిజెపి కైవసం చేసుకుని కాషాయం జెండా భాగ్యనగరంపై ఎగుర వేస్తామని అన్నారు . ఈ విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. అశాస్త్రీయంగా విభజన చేసి కార్పొరేటర్ ఎన్నికలలో లబ్ధి పొందాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి జిహెచ్ఎంసి ఎన్నికలలో అవమానభారం తప్పదని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ 42 శాతం ఇస్తామన్న హామీ ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్లు ఇస్తే దాన్ని బిజెపి పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. గత పదేండ్లుగా బీజేపీ కాషాయ జెండా మోస్తున్నానని, ప్రజలకు సేవ చేసుకోవాలనే భావనతో రానున్న జిహెచ్ఎంసి కార్పొరేటర్ ఎన్నికలలో పార్టీ అవకాశం కల్పిస్తే తప్పనిసరిగా పోటీ చేసి బిజెపి జెండా ఎగరవేస్తానని అన్నారు. త్వరలోనే స్థానికంగా బిజెపి పార్టీ కార్యాలయాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు.



## శ్రీనగర్ కాలనీ సమస్యలపై తక్షణ చర్యలు

: బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి

ఎల్బీనగర్, డిసెంబర్ 16(భారత శక్తి): గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా స్థానిక డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి కాలనీవాసులతో కలిసి మంగళవారం ఉదయం పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు, గత కొన్ని రోజులుగా పరిశుభ్రత కార్మికులు సరిగా విధులు నిర్వర్తించకపోవడం వల్ల కాలనీలో చెత్త పేరుకుపోయిందని కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ ఫిర్యాదును వెంటనే పరిగణనలోకి తీసుకున్న కార్పొరేటర్ జీహెచ్ఎంసీ శానిటేషన్ అధికారులకు సమాచారం అందించడంతో తక్షణమే శుభ్రత చర్యలు చేపట్టి కాలనీలో చెత్త తొలగించారు. ఇలాంటి ఫిర్యాదులు మళ్లీ రాకుండా శానిటేషన్ సిబ్బంది తరచూ కాలనీలను పరిశీలించి నిరంతరం పరిశుభ్రతను పాటించాలని కార్పొరేటర్ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రతే ప్రథమ ప్రాధాన్యమని, సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కాలనీవాసులను కోరారు.ఈ కార్యక్రమంలో శానిటేషన్ జవాన్ లక్ష్మయ్య, కాలనీ వాసులు మల్లికార్జున్, రంజిత్, బీజేపీ నాయకులు రఘునందన్ జోషి, వంశీ యాదవ్, టీంకు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టానుసారంగా డీలిమిటేషన్ ప్రక్రియ..

* తీవ్రంగా విమర్శించినా కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి..

హైదరాబాద్, డిసెంబర్ 16 : డిలిమిటేషన్ అంశంపై నిర్వహించిన జీ.హెచ్.ఎం.సి. కౌన్సిల్ సమావేశం అనంతరం హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ప్రజాభిప్రాయం పరిగణనలోకి తీసుకోకుండా ఇష్టానుసారంగా డిలిమిటేషన్ ప్రక్రియ చేపడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. హయత్‌నగర్ డివిజన్‌ను రెండుగా విభజించినప్పుడు, ఏర్పడిన రెండు డివిజన్లలో ఓటర్ల సంఖ్య సమానంగా ఉండే విధంగా విభజించాల్సి ఉండగా, అది పాటించలేదని ఆయన ఆరోపించారు. ఓట్ల అసమతుల్యత వల్ల ప్రజాప్రాతినిధ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. హయత్‌నగర్ పాత గ్రామం, కుమారికుంటతో పాటు పరిసర కాలనీలను విభజించడం వల్ల స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.




వందల సంవత్సరాల చరిత్ర కలిగిన హయత్ బక్షి బేగం మస్జీద్‌ను హయత్‌నగర్‌కు సంబంధం లేకుండా హైకోర్ట్ కాలనీ డివిజన్‌లో కలిపారని ఆవేదన వ్యక్తం చేశారు. హయత్‌నగర్ అనే పేరు హయత్ బక్షి బేగం పేరుతోనే ఏర్పడిందని, అలాంటి చారిత్రక, ధార్మిక ప్రాధాన్యత కలిగిన మస్జీద్‌ను వేరే డివిజన్‌కు కలపడం సరికాదని కార్పొరేటర్ స్పష్టం చేశారు. మస్జీద్‌లు, దేవాలయాలు వంటి ప్రార్థనా స్థలాలు ప్రజల జీవన విధానంతో ముడిపడి ఉంటాయని, వాటిని రాజకీయ ప్రయోజనాల కోసం విభజించడం సరికాదన్నారు. కాలనీల భౌగోళిక పరిస్థితులు, ప్రజల అవసరాలు, పరిపాలనా సౌలభ్యాలను దృష్టిలో ఉంచుకుని డిలిమిటేషన్ నిర్ణయాలను వెంటనే పునఃసమీక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

## జిహెచ్ఎంసి వార్డ్ పేరు నందిహిల్స్ గా మార్చాలని డిమాండ్

ఎల్బీనగర్, డిసెంబర్ 16 (భారత శక్తి): జిహెచ్ఎంసి వార్డ్ పేరు ప్రశాంత్ హిల్స్ కు బదులుగా నందిహిల్స్ వార్డ్ గా పేరును చేర్చవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ నందిహిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ జిహెచ్ఎంసి మీర్పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు అసోసియేషన్ జిహెచ్ఎంసి ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్ లో ఫిర్యాదును సమర్పించింది. కొత్తగా విస్తరించిన జిహెచ్ఎంసి లో ప్రశాంతి హిల్స్ కొత్త వార్డుగా చేస్తూ ప్రకటన వెలువడటాన్ని మార్చాలని అసోసియేషన్ కోరింది. ఈ ప్రాంతంలో ఉన్న నందిహిల్స్ ని వార్డుగా మార్చాలని కోరింది. నందిహిల్స్ సకల సదుపాయాలకు కూడలిగా ఉందని, 100 ఫీట్ల రోడ్డు నంది హిల్స్ బస్టాండు, ఈ ప్రాంతంలో అన్ని కాలనీలకు కేంద్ర స్థానంగా నెలకొందని పేర్కొంది. 120 ఎకరాలలో 24 రోడ్లు కలిగిన అతి పెద్ద లేఅవుట్ కలిగిన నందిహిల్స్ పరిసర అన్ని కాలనీలకు ప్రధాన కూడలిగా ఉండటం మూలంగా రిజిస్ట్రేషన్లలో కూడా నందిహిల్స్ లొకేషన్ నే భూముల రిజిస్ట్రేషన్ చేసుకునేవారు పేర్కొనడం జరుగుతుందని కూడా తెలియజేసింది. ఈ కాలనీలో ప్రధాన రహదారులు, వ్యాపార, వాణిజ్య ప్రదేశాలు,




బ్యాంకులు, పలు పార్కులు, వాటర్ ట్యాంకులు ఉన్నాయని నంది హిల్స్ కేంద్రానికే ప్రశాంతి హిల్స్ వాసులు కూడా సకల సదుపాయాలకు వస్తుంటారని తెలియజేసింది. రాజకీయ సమావేశాలకు, అధికార సమావేశాలకు,జన సాంద్రత కలిగిన ప్రదేశం నందిహిల్స్ అని తెలియజేసింది.నందిహిల్స్ కాలనీ ఫేస్ 2 రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పులి పల్పుల ఆనందం, గౌరవాధ్యక్షులు కే హనుమంత్ రెడ్డి, సలహాదారు కే తిరుపతి రాజు, మీర్పేట్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి పలువురు ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని కమిషనర్ కార్యాలయంలో సమర్పించారు. నందిహిల్స్ కాలనీలో కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కమిషనర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ను ఆదేశించారు. కాలనీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై దృష్టి సారిస్తామని కమిషనర్ నాగమణి ఈ సందర్భంగా ఆమెను కలసిన కాలనీ ప్రతినిధులకు హామీ ఇచ్చారు.ఇకపై కాలనీవాసులు తమ ఫిర్యాదులను జిహెచ్ఎంసి యాప్ కు మాత్రమే ఫిర్యాదు చేయాలని తెలియజేసింది.



## తెలంగాణ తల్లికి ఘోర అవమానం..!

* ఇదీ తెలంగాణ తల్లిగా చెప్పకొనే విగ్రహాల పరిస్థితి

కందుకూరు,డిసెంబర్ 16 (భారత శక్తి): అంగరంగ వైభవంగా, అట్టహాసంగా, హెలికాప్టర్లలో అతిధులను రప్పించి, కోట్ల రూపాయల ప్రజాధనం నీళ్లలా ఖర్చు పెట్టి, ఆకాశమంత పందిళ్ళు వేసి,మంత్రుల హడావుడి,అధికారుల హంగామాతో జరిగిన తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమం అయిపోగానే ఫ్యూచర్ సిటీలో, ఒక్క అధికారి పర్యవేక్షణ లేకుండా చేసిన తాత్కాలిక ఏర్పాట్లను, నిర్లక్షికంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని కింద పడేసిన సిబ్బంది.

# ఆర్టీసీ కొత్త రూట్ బస్సులు ప్రారంభం

* ఎల్బీనగర్ వయా సైదాబాద్ నుండి హైకోర్టు వరకు రూట్

ఎల్బీనగర్, డిసెంబర్ 16 (భారత శక్తి): దిల్ సుఖ్ నగర్ ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సౌకర్యాన్ని మరింత మెరుగుపరచే దిశగా ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం 55 కాలనీలను కలుపుతూ దిల్ సుఖ్ నగర్ డిపో నుంచి రెండు కొత్త బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కొత్త సర్వీసులు నేడు బుధవారం ఉదయం ఫస్ట్ షిఫ్ట్ నుంచే అందుబాటులోకి రానున్నాయి. 78 ఎల్, ఎల్బీనగర్ నుంచి పాతబస్తీ హైకోర్టు వరకు, 78 బి బైరామల్‌గూడ నుంచి పాతబస్తీ హైకోర్టు వరకు సర్వీసులు నడుపుతున్నారు. 78 ఎల్ రూటు బస్సు ఎల్బీనగర్ నుండి బయలుదేరి దుర్గామందిర్ మీదుగా సరూర్‌నగర్ పోస్ట్ ఆఫీస్, శంకేశ్వర్ బజార్, సరస్వతినగర్, సైదాబాద్ కాలనీ, జైలు, దబీర్‌పుర్, పురాణ హవేలీ, దారుల్ షిఫా,



అఫ్జల్‌గంజ్ మీదుగా హైకోర్టుకు చేరుకుంటుంది. 78బి రూటు బైరామల్‌గూడ నుంచి అవేరా హాస్పిటల్, సరూర్‌నగర్ పోస్ట్ ఆఫీస్, శంకేశ్వర్ బజార్, సరస్వతి నగర్, సైదాబాద్,చంచల్ గూడ జైలు, దబీర్‌పుర్ ఫ్లైఓవర్, పురాణ హవేలీ, దారుల్ షిఫా, అఫ్జల్‌గంజ్ మీదుగా హైకోర్టు వరకు ప్రయాణిస్తుంది. ఈ కొత్త సర్వీసుల ప్రారంభంతో దిల్ సుఖ్ నగర్ డిపో పరిధిలోని అనేక కాలనీల ప్రజలకు నగర కేంద్ర ప్రాంతాలకు ముఖ్యంగా పాతబస్తీ వైపు, హైకోర్టుకు ప్రయాణం మరింత సులభం కానుంది. ఉద్యోగులు, విద్యార్థులు, న్యాయవాదులు సహా సాధారణ ప్రయాణికులు ఈ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరారు.



## నూతన భూగర్భ డ్రైనేజ్ పనులు షురూ..


* పనులను ప్రారంభించిన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి..

హైదరాబాద్, డిసెంబర్ 16 (భారత శక్తి) : హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మంగళవారం రోజు డివిజన్ పరిధిలోని రాక్ టౌన్ కాలనిలో నూతన భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాలనీవాసులకు శాశ్వత పరిష్కారం అందించేలా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ పూర్తయితే మురుగునీటి సమస్య పూర్తిగా తొలగి, పరిశుభ్రమైన వాతా వరణం ఏర్పడుతుందని అన్నారు. అభివృద్ధి పనుల అమలులో నాణ్యతకు పెద్దపీట వేస్తూ, పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పవన్ కుమార్ శర్మ, అనిల్ కుమార్,శివ,నరసింహ,కోటయ్య బుచ్చిరెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌లో మార్పు..

## కొత్త టైం టేబుల్ ఇదే..

హైదరాబాద్, డిసెంబర్ 16 (భారత శక్తి): తెలంగాణలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పు చోటుచేసుకుంది. మార్చి 3న జరగాల్సిన ఇంటర్ సెకండ్ ఇయర్ మ్యాథమెటిక్స్ 2ఎ, బోటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలను 4వ తేదీన నిర్వహించనున్నట్లు బోర్డు అధికారులు వెల్లడించారు. మార్చి 3న హోలీ పండుగ సెలవు నేపథ్యంలో ఈ పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు చేసినట్లు తెలిపారు. మిగతా పరీక్షలన్నీ యథాతథంగా జరుగుతాయని స్పష్టం చేశారు. మార్పు చేసిన షెడ్యూల్ ప్రకారం.. ఇంటర్ పరీక్షల కొత్త టైం టేబుల్ ఇదీ..



సవరించిన కాలపట్టిక

| తేదీ | ఫస్టియర్ | తేదీ | సెకండియర్ |
|---|---|---|---|
| ఫిబ్రవరి 25 | ద్వితీయ భాష | 26 | ద్వితీయ భాష |
| 27వ తేదీ | ఆంగ్లం | 28 | ఆంగ్లం |
| మార్చి 2 | గణితం-1ఏ<br>వృక్షశాస్త్రం<br>పొలిటికల్ సైన్స్ | మార్చి 4 | గణితం- 2ఏ<br>వృక్షశాస్త్రం<br>పొలిటికల్ సైన్స్ |
| 5 | గణితం- 1బి<br>జంతుశాస్త్రం<br>చరిత్ర | 6 | గణితం- 2బి<br>జంతుశాస్త్రం<br>చరిత్ర |
| 9 | భౌతికశాస్త్రం<br>ఆర్థికశాస్త్రం | 10 | భౌతికశాస్త్రం<br>ఆర్థికశాస్త్రం |
| 12 | రసాయనశాస్త్రం<br>కామర్స్ | 13 | రసాయనశాస్త్రం<br>కామర్స్ |
| 14 | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్<br>బ్రిడ్జి కోర్సు గణితం | 16 | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్<br>బ్రిడ్జి కోర్సు గణితం |
| 17 | మోడ్రన్ లాంగ్వేజ్<br>జాగ్రఫీ | 18 | మోడ్రన్ లాంగ్వేజ్<br>జాగ్రఫీ |

# యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్‌ను కలవడం ఆనందదాయకం



ఆంధ్రప్రదేశ్, డిసెంబర్ 16 (భారత శక్తి) : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్‌తో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్, అమెరికా మధ్య దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. ఇరువురి మధ్య పరస్పర ఆసక్తి ఉన్న పలు కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఈ సమావేశం అనంతరం సీఎం చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందించారు. వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, ఆవిష్కరణలు, ప్రజల మధ్య సంబంధాల బలోపేతం వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. "యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ ను కలవడం ఆనందదాయకం. బలమైన వ్యాపార పర్యావరణ వ్యవస్థ, ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన చైతన్యవంతమైన తెలుగు డయాస్పొరా కారణంగా భారత్‌అమెరికా సంబంధాల్లో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. అమెరికా వ్యాపార సంస్థలకు, విద్యాసంస్థలకు ఆంధ్రప్రదేశ్ ఎల్లప్పుడూ నమ్మకమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే భాగస్వామిగా కొనసాగుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమావేశం ఇరుపక్షాల మధ్య సంబంధాలను కొత్త పుంతలు తొక్కిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఢిల్లీలో సోనియాను కలిసి విజన్ డాక్యుమెంట్ అందించిన సీఎం రేవంత్ రెడ్డి

ఢిల్లీ, డిసెంబర్ 16 (భారత శక్తి) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం నాడు ఢిల్లీలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను ఆమెకు అందజేసి, రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గురించి సోనియా గాంధీకి సీఎం రేవంత్ రెడ్డి వివరించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) తెలిపింది. ఇటీవల డిసెంబర్ 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025' వివరాలను కూడా ఆమెకు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రభుత్వ పనితీరు, రాష్ట్ర అభివృద్ధిపై రేవంత్ రెడ్డి దార్శనికతను సోనియా గాంధీ అభినందించారు. విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తూ, ముఖ్యమంత్రికి తన శుభాకాంక్షలు తెలియజేశారు.

**ఏమిటీ విజన్ డాక్యుమెంట్?**

'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్ ప్రకారం, రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిలో భాగంగా 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకోవాలని నిర్దేశించుకున్నారు. ఈ లక్ష్యాలను సాధించేందుకు రాష్ట్రాన్ని క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ), ప్యూర్ (పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ), రేర్ (రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ) అనే మూడు ప్రత్యేక జోన్లుగా విభజించి అభివృద్ధి చేయనున్నారు. ఇటీవల జరిగిన గ్లోబల్ సమ్మిట్‌కు సోనియా గాంధీ సందేశం పంపుతూ, తెలంగాణను 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు ఈ సదస్సు ఒక పెద్ద ముందడుగు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

## ఆస్ట్రేలియా కాల్పుల నిందితుడు సాజిద్ హైదరాబాద్ వాడే

హైదరాబాద్, డిసెంబర్ 16 (భారత శక్తి) : ఆస్ట్రేలియాలోని సిడ్నీలో తీవ్ర కలకలం రేపిన బాండీ బీచ్ ఉగ్రదాడికి హైదరాబాద్‌తో సంబంధాలున్నట్లు తేలింది. ఈ దాడిలో ప్రధాన నిందితుడైన సాజిద్ అక్రమ్ (50) హైదరాబాద్‌కు చెందినవాడేనని తెలంగాణ డీజీపీ కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది. దాదాపు 27 ఏళ్ల క్రితం ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియాకు వెళ్లిన సాజిద్, అక్కడ ఉగ్రవాదిగా మారి ఈ ఘాతుకానికి పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల సిడ్నీలోని ప్రఖ్యాత బాండీ బీచ్‌లో యూదులు హనుక్కా ఉత్సవాలు జరుపుకుంటున్న సమయంలో ఈ దారుణం చోటుచేసుకుంది. సాజిద్ అక్రమ్, అతని కుమారుడు నవీద్ అక్రమ్ (24) విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 15 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో సాజిద్ అక్రమ్ హతమవగా, అతని కుమారుడు నవీద్‌ను అధికారులు అరెస్టు చేశారు. ఇది ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) ప్రేరేపిత దాడి అని ఆస్ట్రేలియా అధికారులు భావిస్తున్నారు. తెలంగాణ డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, సాజిద్ అక్రమ్ హైదరాబాద్‌లో బీకామ్ పూర్తి చేశాడు. సుమారు 27 ఏళ్ల క్రితం, 1998లో స్టూడెంట్ వీసాపై ఆస్ట్రేలియా వెళ్లాడు. అక్కడే యూరప్‌కు చెందిన వెనెరా గ్రోసో అనే మహిళను వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు నవీద్, ఒక కుమార్తె ఉన్నారు. ఇద్దరూ ఆస్ట్రేలియా పౌరసత్వం కలిగి ఉన్నారు. ఆస్ట్రేలియాకు వలస వెళ్లినప్పటికీ, సాజిద్ ఇప్పటికీ హైదరాబాద్ నుంచి జారీ చేసిన భారత పాస్‌పోర్టునే వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ఆస్ట్రేలియా వెళ్లిన తర్వాత కుటుంబ, ఆస్తి వ్యవహారాల నిమిత్తం సాజిద్ ఆరుసార్లు భారత్‌కు వచ్చినట్లు డీజీపీ కార్యాలయం తెలిపింది. అయితే, హైదరాబాద్‌లో అతనికి ఎలాంటి నేర చరిత్ర లేదని స్పష్టం చేసింది. అతని కుటుంబ సభ్యులు కూడా సాజిద్‌కు ఉగ్రవాద సంస్థలతో ఎటువంటి సంబంధాలు లేవని చెబుతున్నారు. ఈ ఘటనను ఆస్ట్రేలియా ప్రభుత్వం యూదు వ్యతిరేక ఉగ్రవాద చర్యగా పరిగణిస్తోంది. అంతర్జాతీయ దర్యాప్తు సంస్థల సహకారంతో ఈ దాడి వెనుక ఉన్న పూర్తి వివరాలను రాబట్టేందుకు విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. ఒకప్పుడు హైదరాబాద్‌లో చదువుకున్న వ్యక్తి ఇలా అంతర్జాతీయ ఉగ్రవాదిగా మారడంపై అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## వక్ఫ్ భూముల పరిరక్షణే లక్ష్యం..

హైదరాబాద్, డిసెంబర్ 16 (భారత శక్తి) : తెలంగాణలో వక్ఫ్ భూముల పరిరక్షణపై తమ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ స్పష్టం చేశారు. భూముల వివరాలను డిజిటలైజ్ చేసేందుకు ప్రత్యేకంగా 'ఉమ్మీద్ పోర్టల్' ఏర్పాటు చేస్తున్నామని, అయితే గత 10 రోజులుగా సాంకేతిక సమస్యలు తలెత్తాయని తెలిపారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 63,180 ఎకరాల వక్ఫ్ ఆస్తులు ఉండగా, ఇప్పటివరకు కేవలం 16,700 ఎకరాల వివరాలను మాత్రమే పోర్టల్‌లో నమోదు చేశారని మంత్రి వెల్లడించారు. ఇంకా 46 వేల ఎకరాలకు పైగా భూముల వివరాలు నమోదు కావాల్సి ఉందన్నారు. తప్పుడు పత్రాలతో భూములను అప్‌లోడ్ చేస్తే వాటిని తిరస్కరిస్తామని హెచ్చరించారు. పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు, యాప్ సరిగా పనిచేయకపోవడం వల్ల భూముల నమోదుకు మరింత సమయం ఇవ్వాలని కోరుతూ ప్రధానమంత్రికి, కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు వివరించారు. ఇటీవల గురుకులాల్లో జరిగిన ఫుడ్ పాయిజనింగ్ ఘటనలను మంత్రి దురదృష్టకరమని అభివర్ణించారు. ఈ ఘటనలపై విచారణకు ఆదేశించామని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా విద్యార్థులకు భోజనం అందించడానికి 30 నిమిషాల ముందే అధికారులు, సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. రాబోయే బడ్జెట్‌లో మైనార్టీల కోసం నిధులు పెంచేందుకు కృషి చేస్తున్నామని, గురుకులాల్లో కేవలం 40 పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయని అజారుద్దీన్ పేర్కొన్నారు.

### రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన..

## కేంద్రమంత్రులతో వరుస భేటీ

ఢిల్లీ, డిసెంబర్ 16 (భారత శక్తి) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశ రాజధాని ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులను కలిశారు. రెండు రోజుల క్రితం మెస్సీతో మ్యాచ్ అనంతరం ఆయన హైదరాబాద్ నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. రెండు రోజులుగా ఆయన ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. మంగళవారం ఆయన కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్‌లతో భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను నిర్మలా సీతారామన్‌కు అందజేశారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు పెట్టే ఖర్చును ఎఫ్ఆర్‌బీఎం పరిధి నుంచి తొలగించాలని రేవంత్ రెడ్డి కోరారు. అనంతరం కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సమావేశమయ్యారు.

## టీటీడీ కీలక నిర్ణయాలు... అర్చకుల వేతనం రూ.45 వేలకు పెంపు

తిరుమల, డిసెంబర్ 16 (భారత శక్తి) : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి భక్తుల సౌకర్యం, సంస్థాగత బలోపేతం లక్ష్యంగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. తిరుపతిలో 20 ఎకరాల విస్తీర్ణంలో భారీ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మించాలని, ముంబైలోని బాంద్రాలో శ్రీవారి ఆలయాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించింది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన మంగళవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ మేరకు ఆమోదం తెలిపారు. సమావేశం అనంతరం ఛైర్మన్ బీఆర్ నాయుడు మీడియాకు వివరాలు వెల్లడించారు. భక్తుల కోసం తిరుపతిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ ప్లానింగ్, ఆర్కిటెక్ట్ నియామకానికి బోర్డు ఆమోదం తెలిపిందన్నారు. అదేవిధంగా, ముంబై బాంద్రాలో రూ.14.40 కోట్లతో శ్రీవారి ఆలయ నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. టీటీడీ ఆలయాల్లోని ధ్వజస్తంభాలు, రథాల తయారీకి అవసరమైన కలప కోసం పలమనేరులో 100 ఎకరాల్లో దివ్య వృక్షాలను పెంచే ప్రతిపాదనకు కూడా ఆమోదముద్ర వేశారు.

**ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట**

ఈ సమావేశంలో టీటీడీ ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. టీటీడీ అనుబంధ ఆలయాల్లో పనిచేస్తున్న 62 మంది అర్చకులు, పరిచారకులు, పోటు వర్కర్లు, ప్రసాదం డిస్ట్రిబ్యూటర్ల వేతనాలను గణనీయంగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీని ప్రకారం అర్చకుల వేతనాన్ని రూ.25 వేల నుంచి రూ.45 వేలకు, పరిచారకులకు రూ.23,140 నుంచి రూ.30,000కు పెంచారు. పోటు వర్కర్లకు, ప్రసాదం పంపిణీ సిబ్బందికి కూడా వేతనాన్ని రూ.30,000కు పెంచుతూ తీర్మానించారు. శ్రీవారి ఆలయంలో ప్రధాన సన్నిధి యాదవతో పాటు అదనంగా మరో సన్నిధి యాదవ పోస్టు భర్తీకి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

**విద్య, వైద్య రంగాలకు ప్రోత్సాహం**

విద్యా, వైద్య రంగాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పాలకమండలి ఆమోదం తెలిపింది. తిరుపతి పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో అత్యాధునిక సౌకర్యాల కోసం అదనంగా రూ.48 కోట్లు కేటాయించారు. టీటీడీ ఆధ్వర్యంలోని 31 విద్యాసంస్థల్లో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, సీసీ కెమెరాల ఏర్పాటుకు, ఎస్వీ జూనియర్, ఎస్పీడబ్ల్యూ జూనియర్ కళాశాలల్లో డేస్కాలర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. ఇంజినీరింగ్ విభాగంలో 60 పోస్టుల భర్తీకి, శ్రీవారి పోటులో 18 సూపర్ వైజర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వ అనుమతి కోరాలని తీర్మానించారు. తిరుమలలోని రహదారులు, కూడళ్లకు వైష్ణవ పురాణాలు, అన్నమాచార్య సంకీర్తనలలోని శ్రీవారి నామాలను పెట్టేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశారు. తలకోనలోని సిద్ధేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.14.10 కోట్లు మంజూరు చేశారు. ఈ నిర్ణయాలన్నీ భక్తులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, టీటీడీని మరింత బలోపేతం చేసేందుకు దోహదపడతాయని ఛైర్మన్ బీఆర్ నాయుడు వివరించారు.




## ముగిసిన జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం.. భాజపా కార్పొరేటర్ల నిరసన

హైదరాబాద్, డిసెంబర్ 16 (భారత శక్తి) : నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన జీహెచ్ఎంసీ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం ముగిసింది. తొలుత డివిజన్ల డీలిమిటేషన్ ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను అధికారులు సభలో ప్రవేశపెట్టారు. అయితే.. డివిజన్ల పునర్విభజనకు వ్యతిరేకంగా భాజపా కార్పొరేటర్లు నిరసన వ్యక్తం చేశారు. దీంతో వారిపై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనల మధ్య సభను వాయిదా వేశారు. డివిజన్ల పునర్విభజనపై అభ్యంతరాలను ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద భాజపా కార్పొరేటర్లు నిరసన చేపట్టారు. డివిజన్ చోరీ జరిగిందంటూ ఆందోళన నిర్వహించారు. జీహెచ్ఎంసీ విడుదల చేసిన మ్యాప్ తప్పులతడకగా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్ల పునర్విభజన గెజిట్ పత్రాలను చించేశారు. అంతకుముందు ఈ అంశంపై ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు కార్పొరేటర్లు మాట్లాడారు. డీలిమిటేషన్‌పై తమ అభ్యంతరాలను సభ దృష్టికి తీసుకెళ్లారు.


## ఆస్ట్రేలియా తరహాలో భారత్ లోనూ కాల్పులు జరిగే అవకాశం..

- **ఆస్ట్రేలియాలోని బాండీ బీచ్‌లో తండ్రీకొడుకుల కాల్పులు, 16 మంది మృతి**
- **ఐసిస్ భావజాలంతోనే ఈ దాడికి పాల్పడినట్లు నిర్ధారణ**
- **భారత్‌లో న్యూ ఇయర్ వేడుకల లక్ష్యంగా దాడులు జరగొచ్చని నిఘా వర్గాల హెచ్చరిక**
- **దాడికి పాల్పడిన ఉగ్రవాదులు భారత పాస్‌పోర్టులు వాడినట్లు వెల్లడి**
- **గోవా వంటి పర్యాటక ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం చేయాలని సూచన**



ఢిల్లీ, డిసెంబర్ 16 (భారత శక్తి) : ఆస్ట్రేలియాలోని సిడ్నీ బాండీ బీచ్‌లో జరిగిన ఉగ్రదాడి భారత్‌లో కలకలం రేపింది. ఈ దాడి నేపథ్యంలో దేశంలోని నిఘా వర్గాలు అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేశాయి. ముఖ్యంగా నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తున్న తరుణంలో ఐసిస్ ప్రేరేపిత ఉగ్రవాదులు పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోవచ్చని హెచ్చరించాయి. ఆస్ట్రేలియాలో హనుక్కా పండగ మొదటి రోజున, 50 ఏళ్ల తండ్రి, 24 ఏళ్ల కొడుకు జరిపిన కాల్పుల్లో 16 మంది ప్రాణాలు కోల్పోయారు. నిందితులు సాజిద్ అక్రమ్, నవీద్ అక్రమ్‌లుగా గుర్తించారు. వీరు ఐసిస్ తీవ్రవాద భావజాలంతో ప్రభావితమయ్యారని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ స్వయంగా ధృవీకరించారు. విచారణలో ఈ తండ్రీకొడుకులు భారత పాస్‌పోర్టులపై ప్రయాణించినట్లు, గత నెల ఫిలిప్పీన్స్‌ను సందర్శించినట్లు తేలడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత నిఘా సంస్థలు (ఐబీ) భద్రతను కట్టుదిట్టం చేయాలని రాష్ట్రాలకు సూచించాయి. సిడ్నీ దాడిని ఒక ఉదాహరణగా చూపి, ఐసిస్ అనుబంధ గ్రూపులు ఆన్‌లైన్‌లో యువతను రెచ్చగొట్టే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో ర్యాడికలైజేషన్ డ్రైవ్‌లు కొనసాగుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. ఇజ్రాయెల్‌హమాస్ యుద్ధాన్ని కూడా ఉగ్రవాద సంస్థలు నియామకాలకు ఒక సాధనంగా వాడుకుంటున్నాయి. నూతన సంవత్సర వేడుకలకు భారీగా జనం తరలివచ్చే గోవా వంటి రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నిఘా వర్గాలు తెలిపాయి. గతంలో ఫరీదాబాద్ కేంద్రంగా పనిచేసిన జైషే మహ్మద్ ప్రేరేపిత మాడ్యూల్ ఢిల్లీలో దాడికి పాల్పడిన విషయాన్ని అధికారులు గుర్తుచేస్తున్నారు. పోలీసులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఉగ్రవాదులు దాడులకు తెగబడే ప్రమాదం ఉందని, అందుకే అప్రమత్తత అత్యవసరమని ఓ సీనియర్ అధికారి తెలిపారు.

## ఐబొమ్మ రవికి మరోసారి పోలీసు కస్టడీ



హైదరాబాద్, డిసెంబర్ 16 (భారత శక్తి) : ఐబొమ్మ నిర్వాహకుడు ఇమంది రవిని మరోసారి పోలీసు కస్టడీకి అప్పగిస్తూ నాంపల్లి జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మరో 3 కేసుల్లో 4 రోజుల చొప్పున 12 రోజులపాటు కస్టడీకి న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. ఈ నెల 18 నుంచి సైబర్‌క్రైమ్ పోలీసులు అతణ్ని విచారించనున్నారు.

# నగర రాజకీయాల్లో గల్లీ లీడర్స్ హవా..!



- ఒక ప్రత్యేక శక్తి కేంద్రంగా గల్లీ లీడర్ వ్యవస్థ..
- బయటకి కనిపించేది చిన్న నేతలుగా మాత్రమే..
- లోపల మాత్రం వారికి అధికార పట్టు, రాజకీయం ఎక్కువే..
- భయపెట్టే రౌడీయిజం, అక్రమ ఆర్థిక వ్యవస్థ వీరి బలం..
- అండర్ గ్రౌండ్ పాలన సాగిస్తున్న నగర గల్లీ లీడర్ వ్యవస్థ..
- వీరి గురించి కూలంకుషంగా పరిశీలిస్తే భయంకర వాస్తవాలు..
- ముఖ్యమంత్రి స్థాయి నాయకుడు సైతం వీరికి లొంగాల్సిందే..
- ఎంత పెద్ద ప్రభుత్వ అధికారి అయినా తలొంచాల్సిందే..
- వీరికి నియమాలు, నిబంధనలతో పనిలేదు.. చట్టం అంటే గౌరవం ఉండదు..
- పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాలు వీరికి కొట్టినపిండి..
- మానవత్వం, ప్రేమతత్వం అసలు తెలియదు..
- భయపెట్టడం.. కావలసింది లాక్కోవడం ఇది మాత్రమే వీరికి తెలిసిన విద్య..
- అండర్ గ్రౌండ్ లో పారలల్ ప్రభుత్వాన్ని నడుపుతున్న గల్లీ లీడర్ వ్యవస్థపై " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " అందిస్తున్న ప్రత్యేక కథనం..

(స్పెషల్ కరస్పాండెంట్)

హైదరాబాద్, డిసెంబర్ 14 (భారత శక్తి ) : గల్లీ లీడర్లు...వీరు ప్రజల సమస్యలు పరిష్కరించేవారిగా నటిస్తారు. కానీ వాస్తవానికి సమస్యల నుంచే వీరి జీవనం కొనసాగుతుంది..

**వీరి వెనుక ఉన్న బడా నాయకులు ఎవరు?:**

గల్లీ లీడర్లు స్వతంత్రంగా ఎదగరు. వీరి వెనుక మూడు స్థాయిల రక్షణ వ్యవస్థ ఉంటుంది...

**స్థానిక కార్పొరేటర్లు.. ఎమ్మెల్యేలు :**

ఎన్నికల సమయంలో ఓట్ల బ్యాంకు అందించేది గల్లీ లీడర్లే.. డబ్బు, మద్యం, బెదిరింపుల వ్యవహారాలు వీరి చేతుల మీదుగానే జరుగుతాయి..

దీనికి బదులుగా వీరు చేసే అక్రమాలకు అండగా నిలుస్తుంటారు..

**అధికార పార్టీల మధ్యవర్తులు :**

ఏ పార్టీ అధికారంలో ఉంటే, ఆ పార్టీ జెండా వీరి చేతిలో ఉంటుంది.. వీరికి అన్ని పార్టీలు సమానమే.. వీరు ఏ పార్టీ మారినా పెద్ద సమస్య కానే కాదు..

వీరికి ఒక సిద్ధాంతం అంటూ ఏమీ ఉండదు.. సర్దుబాటు రాజకీయమే వీరి లక్షణం..

కొందరు అధికారులు, పోలీసులు, మున్సిపల్ సిబ్బంది వీరి చెప్పు చేతల్లో ఉంటారు.. వీరు తలుచుకుంటే అక్రమ నిర్మాణాలపై నోటీసులు ఆగిపోవడం జరుగుతుంది..

ఎలాంటి సంఘటనలు జరిగిన కేసులు నమోదు కాకుండా వీరు చూసుకుంటారు.. ఇంకా వీరు తలచుకుంటే ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్లు కనిపించకుండా పోవడం కూడా జరుగుతుంది..

అయితే ఇదంతా ఒక "సెట్టింగ్ సిస్టమ్" అని చెప్పుకోవచ్చు..

*** గల్లీ లీడర్లు చేసే ప్రధాన దురాగతాలు ఒకసారి చూద్దాం :**

అక్రమ నిర్మాణాలు, భూకబ్జాలు.. ప్రభుత్వ భూములు, నాలాలు, పార్కులు కబ్జా చేయడం..

పేదల పేరుతో కాలనీలు సృష్టించి అమ్మకాలు నిర్వహించడం..

ఒకవేళ నోటీసులు వచ్చినా... వీరు సమాధానం ఇవ్వరు అసలు పట్టించుకోరు.. వీరి తరపున ఒక అడ్వకేట్ ఇవన్నీ చూసుకుంటాడు..

ఇక మాఫియా తరహా వసూళ్లు చేస్తారు.. ఇళ్ల నిర్మాణాలకు 'పర్మిషన్ ఫీజు'.. దుకాణాల నుంచి నెలవారీ మామూలు.. ఫంక్షన్లు, బోనాలు, పండుగల పేరిట వసూళ్లు కూడా చేస్తారు..

ఇకపోతే..ఓటు బ్యాంక్ దోపిడి అన్నది సర్వ సామాన్యం.. ఓటర్ల లిస్టుల మార్పులు చేస్తారు.. అదేవిధంగా నకిలీ ఓట్లు చేరుస్తారు.. మరీ ముఖ్యంగా బెదిరింపులతో ఓటింగ్ నియంత్రణ చేసే సత్తా వీరికి ఉంటుంది..

వీరు ఎంతకు తెగిస్తారు అంటే ప్రజాస్వామ్యంపై నేరుగా దాడి చేస్తారు..బీపోలీస్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తారు.. తమవాళ్లపై కేసులు లేకుండా చూసుకుంటారు.

ఎదురు నిలిచిన వారిపై తప్పుడు కేసులు పెట్టిస్తారు.. స్టేషన్ చుట్టూ మా లీడర్ అంటూ స్థానిక ఎమ్మెల్యే మంత్రుల పేర్లు చెబుతూ తమ పనులు కానిస్తూ ఉంటారు..

ఇక నిరుద్యోగ యువతను ఒక గ్యాంగ్ గా తయారు చేసి వారితో తమ పనులు చేయించుకుంటూ ఉంటారు.



నిరుద్యోగ యువకులకు పని కల్పిస్తూ ఉంటారు.. గొడవలు, బెదిరింపులు, రాజకీయ దాడులు అలవోకగా చేసేస్తూ ఉంటారు.. క్రిమినలైజ్డ్ పాలిటిక్స్‌కు వీరు నర్సరీ లాంటి వారు..

**ప్రజలపై ప్రభావం ఏమిటి?**

నిజాయితీగా ఉన్నవాళ్లకు బ్రతకడం కష్టం అవుతుంది.. ప్రశ్నించినవారిపై దాడులు చేస్తారు.. మహిళలు, బలహీన వర్గాలపై అధికారం దుర్వినియోగం జరుగుతుంది.. నగర జీవితం భయం గుప్పిట్లో బ్రతకాల్సిన సంస్కృతి కొనసాగుతుంది..

*** అసలు ప్రభుత్వాలు ఎందుకు అడ్డుకోలేకపోతున్నాయి? :**

ఎన్నికల అవసరాలు.. ఓటు బ్యాంక్ భయం.. అధికార యంత్రాంగంపై రాజకీయ ఒత్తిళ్లు.. దీంతో గల్లీ లీడర్లు అవసరమైన దుష్టులుగా మారిపోయారు..

*** పరిష్కారం ఏంటి?**

పోలీస్, మున్సిపల్ వ్యవస్థను రాజకీయాల నుంచి విముక్తం చేయాలి

అక్రమ నిర్మాణాలపై నిష్పక్షపాత చర్యలు తీసుకోవాలి.. ఓటర్ల జాబితాలను నిష్పక్షపాతంగా శుద్ధి చేయాలి.. స్థానిక పౌర కమిటీలకు అధికారాలు ఇవ్వాలి.. నిజాయితీగా మాట్లాడే వారిని రక్షించే చట్టాలు అమలు చేయాలి..

నగరాన్ని పాలించేది కేవలం కార్పొరేషన్ కాదు...

గల్లీ లీడర్ చేతుల్లో ఉన్న భయ రాజకీయం కూడా.

వీరి వెనుక ఉన్న బడా నాయకులు బయటపడే వరకు, వీరి దురాగతాలపై కఠిన చర్యలు తీసుకునే వరకు

నగరం నిజమైన ప్రజాస్వామ్యాన్ని చూడదు.

గల్లీ లీడర్ రాజకీయం ఒక వ్యక్తి సమస్య కాదు... అది వ్యవస్థ వైఫల్యం.



## మెట్ టీమ్‌లను.. అభినందించిన హైడ్రా కమిషనర్..

*** హైడ్రాతో పని చేయడం కొత్త అనుభూతినిచ్చిందన్న కాంట్రాక్టర్లు**

హైదరాబాద్, డిసెంబర్ 16 (భారత శక్తి,) : ప్రతి సంవత్సరం చేసే పనే.. కానీ ఈ వర్షాకాలంలో చేసిన పని ఎంతో సంతృప్తినిచ్చింది. భారీవర్షాలు కురిసాయి.. ఒక్క రోజులోనే 10 నుంచి 20 సెంటీమీటర్ల వర్షం పడడం సర్వ సాధారణంగా మారింది. కాని ఎక్కడా వరదలు లేవు. కాలనీలు, బస్తీలు నీట మునగలేదు. ఒక వేళ వరద వచ్చినా.. వెంటనే క్లియర్ అయ్యింది. ఒక పద్ధతి ప్రకారం పని చేసుకుంటూ పోతే ఫలితాలు ఎలా ఉంటాయో ఈ ఏడాది చూశాం.. అధికారుల పర్యవేక్షణ, సహకారం, సమస్య తలెత్తితే పరిష్కరించిన తీరు.. మా పని మరింత సులభం చేసింది. దీంతో క్షేత్ర స్థాయిలో ఫలితాలు కనిపించాయి` అని వర్షాకాలంలో హైడ్రాతో కలసి పని చేసిన మాన్సూన్ ఎమర్జన్సీ టీమ్‌లతో పాటు స్టాటిక్ టీమ్‌ల కాంట్రాక్టర్లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే సమయంలో హైడ్రా కమిషనర్ మెట్ కాంట్రాక్టర్లను అభినందించారు. కల్వర్టులు, క్యాచ్‌పిట్లలో పూడికను తీయడమే ఒప్పందం అయినా.. హైడ్రాతో కలసి నాలాలను కూడా క్లియర్ చేశారని.. దీంతో వరద సాఫీగా సాగిందన్నారు.

## రాక్ టౌన్ సమస్యలను పరిష్కరించండి..

*** అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టండి..**
*** ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డికి విజ్ఞప్తి..**
*** వినతిపత్రం అందజేసిన రాక్ టౌన్ కార్యవర్గ సభ్యులు..**



హైదరాబాద్, డిసెంబర్ 16 (భారత శక్తి,) : ఎల్. బీ. నగర్, నాగోల్ డివిజన్, రాక్ టౌన్ కాలనీలలో గల అనధికారిక స్మశాన వాటికలను వేరే ఏరియాకు తరలించి కాలనీ వాసులకు ఉన్న ప్రధాన సమస్యను తీర్చాలని సుధీర్ రెడ్డిని కలిసి కోరడం జరిగింది. రాక్ టౌన్ కాలనీ లో సుమారు 6000 మంది జనాభా నివసించే కాలనీ లోకి వచ్చే ప్రధాన మెయిన్ రోడ్డులో ఉన్న స్మశాన వాటికల వలన రాకపోకలకు చాలా ఇబ్బంది అవుతుంది. అలాగే ఈ యొక్క స్మశాన వాటికలకు పక్కనే ఉన్న గవర్నమెంట్ ప్రైమరీ, హై స్కూల్ లలో సుమారు 800 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే ఒక జూనియర్ కాలేజీలో సుమారు 300 మంది విద్యార్థులతో పాటు అధ్యాపకులు కూడా ప్రతి రోజు ఈ యొక్క స్మశానవాటికల వలన చాలా ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి ఈయొక్క స్మశాన వాటికలను ఉపయోగిస్తున్న వారికి వీలైనంత త్వరగా వేరే ఏరియాలో సదుపాయాలు కల్పించి వీటిని వెంటనే అక్కడకు తరలించి కాలనీ వాసులకు, గవర్నమెంట్ స్కూల్, జూనియర్ కాలేజీ విద్యార్థి, అధ్యాపకులకు కూడా ఇబ్బంది లేకుండా చూడాలని కోరడం జరిగింది. అలాగే కాలనీలో ఉన్న వివిధ సమస్యల పరిస్కారం కోసం సహకరిస్తూ, రాక్ టౌన్ కాలనీలో ఉన్న పార్కులు, కమ్యూనిటీ హాల్ కి, అవసరమైనటువండి అభివృద్ధి కార్యక్రమాలకు కూడా సహకరించాలని రిక్వెస్ట్ చేయడం జరిగింది. దానికి సుధీర్ రెడ్డి సానుకూలంగా స్పందించి తప్పకుండ సహకరిస్తా అని చెప్పారు. ఈ యొక్క కార్యక్రమంలో కమిటీ సభ్యులు మణిపాల్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సూర్యనారాయణ, రాంచంద్రా రెడ్డి, మాజీ అధ్యక్షులు రాంరెడ్డి, మాధవ రెడ్డి, కాలనీ సభ్యులు వెంకట్ రెడ్డి, సంపత్ కుమార్, సుదర్శన్ చారీ కూడా పాల్గొన్నారని రాక్ టౌన్ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి తెలియజేసారు.

## అయ్యప్ప స్వామి మహా పడిపూజా కార్యక్రమం..

*** పూజలో పాల్గొన్న పారిజాత నర్సింహారెడ్డి..**



హైదరాబాద్, డిసెంబర్ 16 (భారత శక్తి) : మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ లోగల బాలాపూర్ సి ఎన్ రెడ్డి కాలనిలో జరిగిన శ్రీ శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు పాల్గొన్నారు.. ఇంకా ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ చిన్న మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు..

*** ఉత్సవాల్లో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సి.హెచ్. పారిజాత నర్సింహా రెడ్డి..**



హైదేరాబద్, డిసెంబర్ 16 (భారత శక్తి) : చాంద్రయాన్ గుట్ట నియోజక వర్గంలో శ్రీ చెన్న మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి.. ఇందులో భాగంగా ప్రత్యేక పూజలలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఇంకా ఈ కార్యక్రమంలో నాయకులు కె నాగరాజు, సత్యనారాయణ ముదిరాజ్ గురు స్వామి, జంగారెడ్డి, కోఠి, హరీష్ కుమార్, రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.

Brodipet, Guntur-522002. Andha Pradesh. Fax: 040-24054446 Cell:9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2007/22515, Editor: Kesaram Penta Reddy